ప్రజాశక్తి

గురువారం 6 ఏప్రిల్ 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

టిడిపి ఉత్తరాంధ్ర సమీక్షలో ...

స్టీల్‌ప్లాంట్‌పై అజెండా ఏదీ?

రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీ విధానం ఇదేనా?

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం పుట్టిందంటూ చెప్పుకొచ్చిన తెలుగుదేశం పార్టీ ఆంధ్రప్రజల ఆత్మగౌరవమైన విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణపై పార్టీ ఉత్తరాంధ్ర జోన్ సమావేశంలో అజెండా కాకపోవడం దురదృష్టకరం. తెలుగుదేశం పార్టీకి అధికారం లేకపోవడమే ఆత్మగౌరవం లాగ వారి అజెండా తయారీ చూస్తే కనిపిస్తోంది. ఉత్తరాంధ్ర ప్రాంత ప్రధాన వార్తల్లో ప్రధాన శీర్షికలను ఆక్రమిస్తూ ఉన్న ప్రస్తుత ప్రధాన సమస్య స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ. స్టీల్‌ప్లాంట్ రక్షణతోనే ఉత్తరాంధ్రకు రక్షణ అన్న ఆత్మగౌరవ నినాదం టిడిపికి పట్టకపోవడం కనిపిస్తోంది.

కేంద్ర దురాగతాలపై ఎందుకు ప్రశ్నించరు?

కేంద్రంలోని బిజెపి ఆంధ్రప్రదేశ్‌లో జింక్‌ను మూయించేసింది. డిసిఐని దొడ్డిదారిన అమ్మాలన్న కుట్రలను ఇప్పటికీ కొనసాగిస్తోంది. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను దొంగదెబ్బ తీసేందుకు అనుక్షణం ఢిల్లీలో కాపలా కాస్తూ తన కార్పొరేట్లకు కట్టబెట్టే చర్యలను తీవ్రం చేస్తోంది. ఏపికి చాలా రకాల అన్యాయాలకు పాల్పడుతున్నా ప్రధాన రాజకీయ పార్టీలైన అధికార వైసిపి, తెలుగుదేశం, జనసేన పల్లెత్తి మాట్లాడడం లేదు. ముడి సరుకు స్టీల్‌ప్లాంట్‌కు అందకుండా నెలల తరబడి కేంద్రం కుట్రలు పన్నుతోంది. ఆంధ్రా యూనివర్శిటీలో జరిగిన మోడీ సభలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి 'మొహమాటానికి మాత్రం స్టీల్‌ప్లాంట్' అని పేరెత్తారు అంతే. తాజాగా తెలుగుదేశం పార్టీ విశాఖ నగరం నడిబొడ్డున పిఎంపాలెం వి-కన్వెన్షన్ సెంటర్‌లో వేల సంఖ్యలో ఆ పార్టీ శ్రేణులు, ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహిస్తూ రాజకీయ భవిష్యత్తుపై సమీక్షలు, చర్చలు నిర్వహిస్తోంది. ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సమావేశంలో కీలక విషయాలపై చర్చలు జరిపారు. ఆయనకు అన్నీ తెలిసినా ఉత్తరాంధ్రలో సమస్యలేమిటి? అంటూ అనేక సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. మాట వరసకు స్టీల్‌ప్లాంట్ విషయాన్ని లేవనెత్తినట్లు కనిపిస్తోంది. ఇంకనూ ఉత్తరాంధ్రకు సంబంధించిన ప్రజా సమస్యలు అనేకం పరిష్కారం కానివ్వకుండా కేంద్రం వ్యూహరచన చేస్తోంది. సుజల స్రవంతికి నిధులివ్వడం లేదు. గిరిజన యూనివర్శిటీ నిర్మాణం జరగడం లేదు. వెనుకబడిన ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్యాకేజీలను ఆపేసింది. జిల్లాల విభజన జరిగినా ప్రభుత్వ కార్యాలయాలు, మౌలిక వసతులు ఎక్కడా లేవు. ఉత్తరాంధ్రలో జ్యూట్ పరిశ్రమలన్నీ మూసేసినా పట్టించుకున్న పాపాన పోలేదు. ఫెర్రో ఎల్లోయీస్ ఇండస్ట్రీలను మూసేసి వేల మంది కార్మిక కుటుంబాలను రోడ్డున పడేసినా ఇవేవీ తెలుగుదేశం పార్టీ ఉత్తరాంధ్ర సమావేశంలో ఎజెండాలో కాలేకపోయాయి.


స్టీల్‌ప్లాంట్‌పై అజెండాలో లేదు...

ఈ సమావేశంలో 11 అంశాలను అజెండాగా చేసిన తెలుగుదేశం వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాన్ని అజెండాగా చేయకపోవడం ఆ పార్టీ ప్రైవేటీకరణ అనుకూల విధానాన్ని పట్టిచూపుతోంది. పాలకులు ఎవరైనా ఒకటే అన్నది చంద్రబాబు ప్రతిపక్షంలో ఉన్నప్పుడూ

మిగతా 2లో..

ఎమ్మెల్సీ ఎన్నికతో టిడిపి విజయం ప్రారంభం

పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు



విల్లంబు ఎక్కుపెడుతున్న చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి- పిఎం.పాలెం : టిడిపి ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ గెలుపుతో పార్టీ విజయాలు ప్రారంభమయ్యాయని పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. పిఎం.పాలెంలోని వి కన్వెన్షన్ హాల్‌లో టిడిపి ఉత్తరాంధ్ర జిల్లాల టిడిపి జోన్-1 సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు హాజరవడంతో ఉత్తరాంధ్ర టిడిపి అభిమానులు భారీ స్థాయిలో సభా ప్రాంగణానికి చేరుకున్నారు. దీంతో వి కన్వెన్షన్ మొత్తం పసుపుమయమైంది. ముందుగా మూడు జిల్లాల నుంచి వచ్చిన ప్రతినిధుల హాజరు నమోదుకు జిల్లాల వారీగా స్టాల్స్ ఏర్పాటుచేశారు. అనంతరం సభా ప్రాంగణంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పార్టీ జెండాను ఎగురవేశారు. జ్యోతి ప్రజ్వలన చేశారు. బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి, ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు నిర్వహించినా సిద్ధంగా ఉండేందుకు జోన్ల వారిగా సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే రెండు జోన్లు పూర్తి చేసుకున్నామని చెప్పారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర ప్రాంతం వైసిపి ప్రభుత్వ హయాంలో పూర్తిగా అడుగంటి పోయిందని విమర్శించారు. వైసిపి ప్రభుత్వంతో రాష్ట్రానికి దరిద్రం పట్టిందని, ప్రజలు సంక్షోభంలోకి నెట్టబడుతున్నారని ఆరోపించారు. సంపదను సృష్టించి, పేదలకు పంచడం నాయకుడు లక్షణమని, అప్పులు చేసి బటన్‌లు నొక్కడం కాదని ఎద్దేవాచేశారు. నాలుగేళ్ల పాలనలో జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రానికి అభివృద్ధి ఏమీ లేదన్నారు. రానున్న ఎన్నికలలో ఉత్తరాంధ్రలో 34 స్థానాలు టిడిపి గెలుచుకుంటుందని తెలిపారు. ఉత్తరాంధ్రలో టిడిపి ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ గెలుపు చూసి వైసిపికి భయం పట్టుకుందన్నారు.

అనంతరం సోషల్ మీడియాలో భాగంగా ఐటిడిపి యాప్ ద్వారా సభ్యత్వాల నమోదు,

మిగతా 2లో..

చలో ఢిల్లీకి మద్దతుగా సిఐటియు ధర్నా

▶ వార్త 8లో..

చంద్రబాబు ఉత్తరాంధ్ర ద్రోహి : మంత్రి అమర్‌నాథ్

▶ వార్త 2లో..

చందనోత్సవ ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

▶ వార్త 4లో..

మే 30లోగా వేతన సమస్యలు పరిష్కరిస్తాం

అఖిలపక్ష నాయకులతో చర్చల్లో గంగవరం పోర్టు యాజమాన్యం హామీ

ప్రజాశక్తి- గాజువాక

అదానీ గంగవరం పోర్టు కార్మికుల వేతన సమస్యలను మే 30వ తేదీలోగా పరిష్కరిస్తామని యాజమాన్యం హామీ ఇచ్చింది. అఖిలపక్ష నాయకులకు, పోర్టు యాజమాన్యానికి మధ్య గంగవరం పోర్టులో బుధవారం రాత్రి చర్చలు జరిగాయి. కార్మికులకు రూ.36 వేల కనీస వేతనం ఇవ్వాలని, వేజ్ బోర్డు ఏర్పాటు చేయాలని, బేసిక్‌లో మార్పులు చేయాలని, సమస్యలపై చర్చించేందుకు యూనియన్ నాయకులకు యాజమాన్యం అనుమతి ఇవ్వాలని, డిఎ, బేసిక్ మెర్జ్ చేయాలని, తొలగించిన ముగ్గురు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. గతంలో ప్రస్తావించిన పలు డిమాండ్లను కూడా యాజమాన్యం దృష్టికి వారు తీసుకెళ్లారు. దీనికి యాజమాన్యం స్పందిస్తూ, జీతాల్లో మార్పులు తీసుకొస్తామని, గతంలో ఉన్న జిపిఎల్, జిపిఎస్ రద్దు చేసి అదాని పేరుతోనే నియామక ఆర్డర్లు ఇస్తామని, జనవరిలో పెంచిన ఇంక్రిమెంట్లను ఎరియర్స్‌గా ఏప్రిల్ 30 లేదా మే 30 లోగా చెల్లిస్తామని హామీ ఇచ్చింది. ఈ చర్చల్లో గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షులు డాక్టర్ బి.గంగారావు, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గురుమూర్తి రెడ్డి, చింతలపూడి వెంకటరామయ్య, సిపిఎం నాయకులు కొవిరి అప్పలరాజు, సిపిఐ నాయకులు కసిరెడ్డి సత్యనారాయణ, టిడిపి నాయకులు, పోర్టు యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

పోరాటయోధులు సునీత్ చోప్రా, సుబ్బారావు

సంతాప సభలో లోకనాధం



నివాళులర్పిస్తున్న లోకనాథం, జగ్గునాయుడు తదితరులు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : సిపిఎం పూర్వ కేంద్ర కమిటీ సభ్యులు, వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్త కార్యదర్శి సునీత్ చోప్రా, సిపిఎం పూర్వ జిల్లా కమిటీ సభ్యులు, సిఐటియు రాష్ట్ర నాయకులు జి.సుబ్బారావు కార్మిక, కర్షక పోరాటయోధులని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాధం కొనియాడారు. జగదాంబ సమీపంలోని ఎన్‌పిఆర్ భవనంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్ అధ్యక్షతన బుధవారం సంతాపసభ నిర్వహించారు. సభకు ముందుగా సునీత్‌చోప్రా, జి. సుబ్బారావుల చిత్రపటాలకు కె.లోకనాథం, ఎం.జగ్గునాయుడు పూలమాల వేసి నివాళర్పించారు.

ఈ సందర్భంగా కె.లోకనాథం మాట్లాడుతూ, గుర్గావ్ నుంచి ఢిల్లీకి మెట్రోలో ప్రయాణిస్తుండగా సునీత్ చోప్రా గుండెపోటుతో మరణించారన్నారు. సునీత్ చోప్రా జెఎన్‌యు విద్యార్థి ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారని తెలిపారు. ఉన్నత కుటుంబంలో జన్మించిన ఆయన వ్యవసాయ కార్మికుల ఉద్యమానికి అంకితమైన కేడర్‌గా మారారని, భారతదేశంలోని వాయువ్య ప్రాంతంలో వ్యవసాయ కార్మికులను సంఘటిత పరచటంలో ముఖ్యమైన పాత్ర పోషించారని తెలిపారు. అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్త కార్యదర్శిగా చాలా కాలం పనిచేశారన్నారు. సునీత్ చోప్రా 1995లో 15వ మహాసభలో సిపిఎం కేంద్ర కమిటీకి ఎన్నికై 2015 వరకు ఆ స్థానంలో కొనసాగారని తెలిపారు.

జి.సుబ్బారావు గాజువాక పట్టణ కమిటీ కార్యదర్శిగానూ, జిల్లా కమిటీ సభ్యునిగా, ఉమ్మడి రాష్ట్రంలో మున్సిపల్ యూనియన్ అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహించారని, తుదిశ్వాస వరకూ ప్రజాసమస్యలపై పోరాడారని కొనియాడారు. కార్మికులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో సుబ్బారావు ఎనలేని కృషి చేశారన్నారు. విద్యార్థి, మహిళా, యువజన ఉద్యమాలకు తోడ్పాటునందించారని తెలిపారు. సునీత్‌చోప్రా, సుబ్బారావు మరణం ప్రజా ఉద్యమానికి, వామపక్ష ఉద్యమానికి తీరనిలోటని పేర్కొన్నారు. సుబ్బారావు సంస్మరణ సభ ఈ నెల 12న గాజువాకలో జరుగుతుందని, ఈ సభకు

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

స్టీల్‌ప్లాంట్‌పై అజెండా ఏదీ?

వ్యవహరించడం విశేషం. స్టీల్‌ప్లాంట్‌పై అజెండా చేయకుండా ఊదరగొట్టుడు ఉపన్యాసాలు ఈ సమావేశంలో బాబు, ఇతరులు ఎన్ని చెప్పినా అవి ఏ మాత్రం కార్మికవర్గ పోరాటానికి బాసటగా నిలవవు అన్నది ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. ఇంకా చెప్పాలంటే మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ నాయకుడు గంటా శ్రీనివాసరావు రాజీనామా లేఖ లాంటి ప్రసంగాలే తప్ప వీటి వల్ల స్టీల్‌ప్లాంట్ కార్మికులు, ప్రజల మనోభావాలను కాపాడేవి ఎంతమాత్రం కావన్నది స్పష్టమవుతోంది.

ఎమ్మెల్సీ ఎన్నికతో టిడిపి విజయం ప్రారంభం

టెలిగ్రామ్ బాట్ ద్వారా ప్రతినిధులు హాజరు నమోదుపై శిక్షణ, కుటుంబ సాధికార సారధి నియామక ప్రక్రియపై అవగాహన, వైసిపి మోసకారి సంక్షేమంపై అవగాహన, కార్యకర్తల సంక్షేమ, న్యూ ట్రిపుల్ యాప్‌పై అవగాహన, సామాజిక మాధ్యమాలు, వాట్సప్ యాప్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. భోజనం అనంతరం చంద్రబాబు ప్రసంగంతో అభిమానుల్లో ఉత్సాహం రెట్టింపయింది. చంద్రబాబు ప్రసంగం అనంతరం ఆయన అభిమానులకు కారు బయట నుంచి అభివాదం చేస్తూ తరలివెళ్లారు. అభిమానులతో జాతీయ రహదారి మొత్తం సందడితో కిక్కిరిసిపోయిన పరిస్థితి కనిపించింది.

పోరాట యోధులు సునీత్‌చోప్రా, సుబ్బారావు

పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిఐటియు తెలుగు రాష్ట్రాల నాయకులు పాల్గొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బి.పద్మ, పి.మణి, కెఎం.శ్రీనివాసరావు, పి.పైడిరాజు, వి.కృష్ణారావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ రక్షణకు ముఖ్యమంత్రి చొరవ చూపాలి

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చొరవ చూపాలని ఐఎన్‌టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవిల్లి నాగభూషణం విజ్ఞప్తిచేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన దీక్షలు బుధవారం నాటికి 734వ రోజుకు చేరాయి. దీక్షల్లో ఐఎన్‌టియుసికి చెందిన హెచ్ పిసిఎల్ కాంట్రాక్ట్ కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా నాగభూషణం మాట్లాడుతూ, విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరణ చేయకుండా ప్రభుత్వ రంగంలోనే కొనసాగే విధంగా రెండేళ్లకు పైగా రాష్ట్రవ్యాప్తంగా కార్మిక, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు ఉద్యమిస్తున్నా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వెనక్కి తగ్గడంలేదన్నారు. మోడీ ప్రభుత్వం తన నిర్ణయాన్ని వహాంచుకోవాలంటే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సరిగా స్పందించాలన్నారు. అన్ని రాజకీయ పార్టీలను, కార్మిక సంఘాల నాయకులను ముఖ్యమంత్రి ఢిల్లీకి తీసుకెళ్లి మాట్లాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి వై.నర్సింగయాదవ్, అధ్యక్షుడు ఎస్.తాతబాబు తదితరులు పాల్గొన్నారు.



దీక్షలో కూర్చున్న హెచ్‌పిసిఎల్ ఐఎన్‌టియుసి కాంట్రాక్టు కార్మికులు

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

కలెక్టర్ మల్లికార్జున


ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు ల్యాప్‌టాప్‌లు అందిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో నిర్మాణాలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆదేశించారు. బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు 40 మందికి లాప్ టాప్స్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, లాప్‌టాప్స్ సౌలభ్యం వల్ల లబ్ధిదారుల తరపున బిల్స్ అప్డేట్ చేసే సమయం ఆదా అవుతుందన్నారు. లబ్దిదారులకు ప్రభుత్వం సబ్సిడీ ధరకు అందించే ఇనుము, సిమెంట్, ఇసుక తదితర సామాగ్రి వేగవంతంగా అందించడానికి అవసరమైన చర్యలు తీసుకోవడానికి వీలు కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్, రెవెన్యూ డివిజనల్ అధికారులు హుస్సేన్ సాహెబ్, భాస్కర రెడ్డి, హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అమర్‌నాథ్

చంద్రబాబు ఉత్తరాంధ్ర ద్రోహి - మంత్రి అమర్‌నాథ్

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : చంద్రబాబు ఉత్తరాంధ్ర ద్రోహి అని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. స్థానిక సర్క్యూట్ హౌస్‌లో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, చాలాకాలంగా ఉత్తరాంధ్ర ప్రాంతాన్ని పట్టించుకోని చంద్రబాబు ఎన్నికలు వస్తున్నాయని సదస్సుల పేరుతో ఈ ప్రాంత ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. 14 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన ఆయన ఉత్తరాంధ్ర ప్రజలకు ఏం చేశారని ప్రశ్నించారు.

9న అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంఘం సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్వసభ్య సమావేశం ఈ నెల 9వ తేదీన ఆంధ్రా యూనివర్శిటీ ఇంజినీరింగ్ కాలేజ్ వైవిఎస్.మూర్తి ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు కోరాబు సత్యనారాయణ తెలిపారు. బుధవారం ఉదయం ఎంవిపి కాలనీలోని గిరిజన్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 9వ తేదీ ఉదయం 9 గంటలకు మద్దిలపాలెం కూడలిలో బోయ,వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చిన తీర్మానానికి వ్యతిరేకంగా నిరసన ర్యాలీ చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ మహాసభ జాతీయ అధ్యక్షులు పివి.రమణ, జాతీయ ప్రధాన కార్యదర్శి బానోతు హరిరామ్, రాష్ట్ర అధ్యక్షులు పవన్‌కుమార్, రాష్ట్ర చైర్మన్ బానోతు చక్రి నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబశివరావు హాజరవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి రూడ సత్యారావు తదితరులు పాల్గొన్నారు

పోర్టులో జాతీయ మారీటైం దినోత్సవం

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : విశాఖపట్నం పోర్టు ఆధ్వర్యాన 60వ జాతీయ మారీటైం దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ ఏడాది అమృత్ కాల్ షిప్పింగ్ థీమ్‌తో మేరీటైం దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. పోర్టు డిప్యూటి చైర్మన్ దుర్గేష్ కుమార్ దూబే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మేరీటైం దినోత్సవం ప్రాసస్త్యాన్ని వివరించారు. ఈ సందర్భంగా మెరైన్ విభాగంలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన అధికారులకు, ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు, మెమెంటులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పోర్టు చీఫ్ విజిలెన్స్ అధికారి పిఎస్ఎల్ స్వామి, పోర్టు విభాగాధిపతులు పాల్గొన్నారు.

14 నుంచి ఇంటింటికీ సిపిఐ

ప్రజాశక్తి -మధురవాడ : కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ అంబేద్కర్ జయంతి రోజు, ఏప్రిల్ 14 నుంచి నిర్వహించే ఇంటింటికి సిపిఐ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు పిలుపునిచ్చారు. బుధవారం మధురవాడ సిపిఐ కార్యాలయం పోతిన సన్యాసిరావు భవనంలో నిర్వహించిన పార్టీ ఏరియా సమితి సమావేశంలో మాట్లాడుతూ సిపిఐ జాతీయ సమితి నిర్ణయం మేరకు అంబేద్కర్ జయంతి నుంచి గ్రామాలలో సమస్యలపై పాదయాత్రలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మధురవాడ జాతీయ రహదారి నుండి నగరంపాలెం రహదారి ప్రారంభించి ఏళ్ళు గడుస్తున్నా నేటికీ పూర్తి చెయ్యకపోవడం రాష్ట్ర ప్రభుత్వం పనితీరుకి నిదర్శనం అన్నారు. స్వతంత్ర నగర్, అయోధ్య నగర్, ద్రోణంరాజు కల్యాణ మండపం వద్ద, పాత మధురవాడ సహా ఏరియాలో ఉన్న మంచినీరు ట్యాంకులు పాడైపోతున్నాయని, వీటి స్థానంలో నూతనంగా ట్యాంకులు నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ ఏరియా కార్యదర్శి వాండ్రాసి సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు ఎం డి బేగం, జి వేళంగినిరావు, ఎం ఎస్ పాత్రుడు, పి వి అప్పారావు, బి కేశవయ్య, త్రినాథ్ పాల్గొన్నారు.

సముద్ర తీరంలో స్వచ్ఛభారత్

ప్రజాశక్తి -మధురవాడ : రుషికొండ బీచ్‌లో బుధవారం బీచ్ క్లీనప్ కార్యక్రమం నిర్వహించారు. ప్లాటిపస్ ఎస్కేప్స్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో సుభాష్ చంద్రన్, సిండ్రిల్లా నేతత్వంలో ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ ప్రొఫెసర్ పి జానకిరామ్, కో-ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ కె ఉమాదేవి, వారి పరిశోధన బృందంతోపాటు స్కూబా డైవింగ్ బృందం ఈ కార్యక్రమంలో పాల్గొని, బీచ్‌లో వ్యర్థాలు, ప్లాస్టిక్ చెత్తను సేకరించారు. సేకరించిన అవక్షేప నమూనాలను ఎయులోని సముద్ర జీవ వనరుల విభాగానికి విశ్లేషణకు పంపారు. ఫ్యాబ్రిక్, ప్లాస్టిక్ చెత్తను జివిఎంసికి అప్పగించారు. కార్యక్రమంలో విద్యార్థి వాలంటీర్లు, బీచ్ సందర్శకులు పాల్గొన్నారు. బీచ్ క్లీనప్‌కు సహకరించిన ఎయు విసి ప్రొఫెసర్ ప్రసాదరెడ్డి, రిజిస్ట్రార్ కృష్ణమోహన్, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావులతోపాటు యూరోపియన్ కమిషన్, జివిఎంసి, మెరైన్ పోలీసు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎంపిడిఒగా విజయకుమార్

ప్రజాశక్తి-పద్మనాభం : ఎంపిడిఒగా ఎం విజయ్‌కుమార్ బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. స్వచ్ఛభారత్ జిల్లా కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్న విజయకుమార్‌ను పద్మనాభం ఎంపిడిఒగా జిల్లా అధికారులు నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయగా, ఈ మేరకు విధుల్లో చేరారు. కాగా ఇప్పటివరకు పద్మనాభం మండలానికి రెగ్యులర్ ఎంపిడిఒ లేకపోగా, ఇ.రాధ ఇన్‌ఛార్జి బాధ్యతలను నిర్వర్తించారు. కొత్త ఎంపిడిఒకు బాధ్యతలు అప్పగించారు.

పరిశ్రమల్లో కండిషన్ మోనటరింగ్ కీలకం

గీతం వర్క్‌షాప్‌లో టాటా స్టీల్ పరిశ్రమ ఉపాధ్యక్షుడు ప్రబల్ ఘోష్



ప్రబల్ ఘోష్‌ను సత్కరిస్తున్న గీతం ప్రతినిధులు

ప్రజాశక్తి- మధురవాడ : ఉక్కు పరిశ్రమలలో ప్రమాదాలను నివారించడం, యంత్రాల పనితీరును సమీక్షించడం ద్వారా ఉత్పాదనకు అంతరాయం కలగకుండా చూడటంలో కండిషన్ మోనటరింగ్ కీలక పాత్ర పోషిస్తోందని టాటా స్టీల్ పరిశ్రమ ఉపాధ్యక్షుడు ప్రబల్ ఘోష్ అన్నారు. బుధవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం, కండిషన్ మానిటరింగ్ సొసైటీ ఆఫ్ ఇండియా సంయుక్తంగా నిర్వహించిన డాక్టర్ వి.భుజంగరావు ధార్మికోపన్యాసంలో మాట్లాడుతూ, యంత్రాల దీర్ఘకాలిక పనితీరును మెరుగుపరచడానికి కండిషన్ మోనటరింగ్ అవసరమన్నారు. పరిశ్రమలలోని విభాగాలను డిజిటలీకరణ ద్వారా ఆయా విభాగాలలో యంత్రాల పనితీరుపై రోజువారీ సమాచారం లభిస్తుందని, ఆ డేటాను విశ్లేషించడం ద్వారా రాబోయే ప్రమాదాలు ముందుగానే గుర్తించి యంత్రాలకు మరమత్తు చేయవచ్చునన్నారు. యంత్రాల డిజైనింగ్‌లో మార్పులు చేసుకోవడానికి కండిషన్ మానిటరింగ్ ఉపయోగపడుతుందన్నారు. రాబోయే దశాబ్ధకాలంలో ఇండస్ట్రీ 5.0 దశలో ఐఓటి, మిషన్‌లెర్నింగ్ పరిజ్ఞానం పరిశ్రమలను ముందుకు నడిపిస్తుందని, దానికి తగ్గట్లుగా సాంకేతిక నిపుణులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.. టాటా ఉక్కు పరిశ్రమలలో కండిషన్ మానిటరింగ్ కేంద్రం పనితీరును వివరించారు.

కిమ్స్ ఫౌండేషన్ రీసెర్చి సెంటర్ ఛైర్మన్ డాక్టర్ వి.భుజంగరావు మాట్లాడుతూ పరిశ్రమలలోనే కాక రైల్వేలు, వైద్య ఆరోగ్య రంగంలో కండిషన్ మానిటరింగ్ వినియోగం పెరుగుతోందనానరు. యువ పరిశోధకులు కండిషన్ మానిటరింగ్‌పై అధ్యయనాలు జరపాలని సూచించారు. కండిషన్ మానిటరింగ్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షులు, ఎన్ఎస్‌టిఎల్ అసోసియేట్ డైరక్టర్ డాక్టర్ గణేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత ఇండస్ట్రీ 4.0గా పేర్కొనే నాల్గవ పారిశ్రామిక విప్లవంలో కండిషన్ మానిటరింగ్ కేంద్ర బిందువుగా మారిందన్నారు. కండిషన్ మానిటరింగ్ సొసైటీ ఆఫ్ ఇండియాకు దేశ వ్యాప్తంగా 30 పరిశ్రమలు, 500 మందికి పైగా పారిశ్రామిక నిపుణులు సభ్యత్వం ఉందన్నారు. ఈ ఏడాది ఎన్ఎస్‌టిఎల్ ఆధ్వర్యంలో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా టాటా స్టీల్ పరిశ్రమ ఉపాధ్యక్షుడు ప్రబల్ ఘోష్‌ను సన్మానించారు. కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ సి.విజయశేఖర్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ వి.శ్రీనివాస్, భాను పవన్ పాల్గొన్నారు.

అలరించిన అబాకస్, స్టోరీ నారథాన్ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న చైతన్య ఎజిఎం సురేష్

ప్రజాశక్తి- పిఎం పాలెం: కొమ్మాది చైతన్య స్కూల్స్‌లో ప్రాథమిక విద్యార్థులకు బుధవారం నిర్వహించిన అబాకస్, స్టోరీ నారథాన్ పోటీలు అలరించాయి. విశాఖపట్నం, అనకాపల్లి, నర్సీపట్నం, ఎలమంచిలి పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీలను ఉత్తరాంధ్ర శ్రీచైతన్య స్కూల్స్ ఎజిఎం ఎంవి. సురేష్ జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈసందర్భంఆ మాట్లాడుతూ, గణితంలో విద్యార్థుల సృజనాత్మకతను పెంపొందించేందుకు సులభమైన పద్ధతిలో తక్కువ సమయంలో అబాకస్ స్కేల్ అనే పరికరాన్ని ఉపయోగించి గణన చేయడం ముఖ్య ఉద్దేశమన్నారు. సామాజిక విలువలు గుర్తిస్తూ పటిష్టమైన వాక్చాతుర్యం ప్రదర్శించే ప్రతిభ కోసం స్టోరీ నారథాన్‌కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు ఆంధ్ర,తెలంగాణ రాష్ట్రాల ప్రైమరీ అకడమిక్ కోఆర్డినేటర్ ఎం.పద్మ బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు స్కూల్స్ డైరెక్టర్ సీమ, నాగేంద్ర అభినందించారు. కార్యక్రమంలో శ్రీ చైతన్య స్కూల్స్ ఆర్ఐలు వై.ఆశిబాబు, ఎం.రమణ, అహ్మద్ అలీ, ప్రైమరీ జోనల్ కోఆర్డినేటర్ ఐఎస్‌వి.శైలజ పాల్గొన్నారు.

ఆసరాతో మహిళలకు ఆర్థిక భరోసా

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ప్రజాశక్తి -పద్మనాభం : వైఎస్సార్ ఆసరాతో మహిళలకు ఆర్థిక చేయూత, భరోసా కల్పించాలన్నదే సిఎం జగన్ నేతృత్వంలోని వైసిపి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మండలంలోని బిఆర్.తాళ్లవలసలో వైఎస్సార్ ఆసరా సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తంశెట్టి మాట్లాడుతూ, ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా వైఎస్సార్ ఆసరా కింద డ్వాక్రా మహిళలకు వరుసగా మూడోఏడాది ఆర్థికసాయం అందించామన్నారు. మండలంలోని 22 పంచాయతీల్లో 1186 మహిళా సంఘాలకు చెందిన 12,575మంది సభ్యులకు రూ.10.99 కోట్లు ఆర్థిక లబ్ధి చేకూరనుందని వెల్లడించారు. రెడ్డిపల్లి దళితవాడలో తాగునీటికి ఇక్కట్లు పడుతున్నామని స్థానిక మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తేగా వెంటనే తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎంపిపి రాంబాబు, జెడ్‌పిటిసి గిరిబాబు, వైసిపి మండల అధ్యక్షుడు కె.లక్ష్మణరావు, వెలుగు పీడీ శోభారాణి తహశీల్దార్ శ్రీవల్లి, ఎంపిడిఒ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

గోపాలపట్నం/ ఎంవిపి కాలనీ : ప్రజా సంక్షేమంతోపాటు మహిళల ఆర్థికస్వావలంభనే లక్ష్యంగా వైసిపి ఆర్థిక ప్రభుత్వం పనిచేస్తోందని పశ్చిమ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మూడో విడత ఆసరా పంపిణీలో పాల్గొని మాట్లాడుతూ, నియోజకవర్గ పరిధిలోమూడో విడతలో మహిళలకు ఆసరా కింద రూ.34.45కోట్ల ఆర్థిక లబ్ధిని ప్రభుత్వం అందజేసిందన్నారు. గత ప్రభుత్వం డ్వాక్రాసంఘాలను నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తాను పశ్చిమ నియోజకవర్గంలో వైసిపి తరపున పోటీలో ఉంటానని, మహిళలు ఆశీర్వదించి, మద్దతునివ్వాలని కోరారు. కార్యక్రమంలో రీజనల్ జెసిఎస్ హర్షవర్ధన్‌రెడ్డి, పశ్చిమ నియోజకవర్గ వైసిపి పరిశీలకులు ఎస్‌ఎ.రెహమాన్, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, స్థాయీ సంఘం సభ్యులు డాక్టర్ పివి.సురేష్, 57వ వార్డు కార్పొరేటర్ ముర్రువాణి పాల్గొన్నారు. పరిశీలిక్కడ ఎస్ ఏ రెహమాన్, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, స్థాయి సంఘం సభ్యుడు పీవీ సురేష్, 57వ వార్డ్ కార్పొరేటర్ ముర్రు వాణి, అధికారులు పార్టీ నాయకులు కార్యకర్తలు. పాల్గొన్నారు

కలెక్టరేట్, విశాఖ : దక్షిణ నియోజకవర్గంలోని డ్వాక్రా సంఘాల మహిళలకు వైఎస్ఆర్ ఆసరా మూడో విడత కింద రూ.6.41 కోట్లను బుధవారం టర్నర్ చౌల్ట్రీలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ పంపిణీ చేశారు. ముందుగా జగ్జీవన్‌రామ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులు, క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ జాన్ వెస్లీ, స్టేట్ రెల్లి కుల చైర్మన్ వడ్డాది మధుసూదనరావు, వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీ, శ్రీ కనకమహాలక్ష్మి దేవస్థానం చైర్ పర్సన్ కొల్లి సింహాచలం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆనందకుమార్

నేరాలు ఘోరాలు

అనుమానాస్పద రీతిలో వ్యక్తి మృతి



రైల్వే ట్రాక్ పక్కన మృతదేహం

ప్రజాశక్తి -కంచరపాలెం : ఆశవానిపాలెం అశోక్‌పార్కు రైల్వే ట్రాక్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద రీతిలో మృతి చెందాడు. బుధవారం మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు ఎయిర్‌పోర్టు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులకు క్లూస్‌టీం ఆధారంగా వివరాలు సేకరించారు. మృతదేహాన్ని కెజిహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా మృతుడు ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడడంతో మృతి చెంది ఉంటాడని, మృతుడు జార్ఖండ్ లేదా పశ్చిమబెంగాల్‌కు చెందిన వ్యక్తి కావచ్చని అనుమానిస్తున్నారు.

ఎన్ఎస్ఆర్ఐటిలో త్రీడీ ప్రింటింగ్‌పై వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో పాల్గొన్న అభ్యర్థులు

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలో శొంఠ్యాంలోని నడింపల్లి సత్యనారాయణరాజు ఇంజనీరింగ్ కళాశాల (ఎన్ఎస్ఆర్ఐటి) మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో త్రీడీ ప్రింటింగ్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా విభాగాధిపతి డాక్టర్ పిఎన్ఇ నవీన్ మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో త్రీడీ ప్రింటింగ్‌కు మిలటరీ, మెడికల్, ఇంకా విభిన్న రంగాల్లో ముఖ్యమైన భూమిక పోషిస్తోందన్నారు. అన్నిరకాల ఇండస్ట్రీస్‌లో ఆటోమేషన్, నూతన టెక్నాలజీలతో త్రీడీ ప్రింటింగ్ ఉన్నతమైన స్థాయికి చేరిందన్నారు. ఆసుపత్రుల్లో మానవ అవయవాలు మార్పిడి ఆపరేషన్ల ప్రక్రియలో భాగంగా త్రీడీ అత్యవసరమన్నారు. భవిష్యత్తులో దీనికి మరింత డిమాండ్ పెరిగే అవకాశం ఉందన్నారు. 50 మంది విద్యార్థులు ఆధునిక నైపుణ్యతను అందిపుచ్చుకునేందుకు కృషి చేస్తున్నారన్నారు. వారికి శిక్షణ ఇస్తున్న ప్రకాష్ డైనోపిటిఎఫ్ ప్రైవేట్ లిమిటెడ్ డాక్టర్ ఎం.రాజు, పుదుచ్చేరిలోని బాహుబలేంద్ర నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ రాజా మురుగదాస్, ట్రెజరర్ కనకరాజు, సెక్రటరీ డాక్టర్ ఎన్ ప్రసాద్‌రాజు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్

ప్రజాశక్తి- సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త, నెడ్‌క్యాప్ ఛైర్మన్ కెకె.రాజు బుధవారం పార్టీ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించారు..ఈ సందర్భంగా నియోజకవర్గంలో పలుప్రాంతాల నుంచి ప్రజలు వచ్చి తమ సమస్యను విన్నవించగా, వాటిని స్వయంగా విన్న కెకె.రాజు, వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలిన సమస్యల పరిష్కారానికి ఆయా అధికారులకు రిఫర్ రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జివిఎంసి ఫ్లోర్‌లీడర్ బాణాల శ్రీనివాసరావు, పద్మారెడ్డి పాల్గొన్నారు.

'జగనన్నే మా భవిష్యత్'పై సమీక్ష

ప్రజాశక్తి- సీతమ్మధార : జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ద్వారా సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, వాలంటీర్లు ఈ నెల 7 నుంచి 20వరకు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేసిన మంచితోపాటు, విపక్షాల దుష్ప్రచారంపై ప్రజలకు వివరించాలని ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ ఛైర్మన్ కెకె.రాజు సూచించారు. బుధవారం పార్టీ కార్యాలయంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం అమలుపై సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ కంపా హనోక్, అల్లు శంకరరావు, స్టాండింగ్ కమిటీ సభ్యులు సారిపిల్లి గోవింద్, బర్కత్ అలీ, కార్పొరేటర్లు సాడి పద్మారెడ్డి, ఆళ్ల లీలావతి శ్రీనివాస్, పి.ఉషశ్రీ, కె.కామేశ్వరి, వి.ప్రసాద్, రెయ్యి వెంకటరమణ పాల్గొన్నారు.

సుబ్బారావు స్ఫూర్తితో ఉద్యమాలు



సుబ్బారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కార్మిక నేతలు

ప్రజాశక్తి -మధురవాడ : మున్సిపల్ యూనియన్ సిఐటియు రాష్ట్ర నాయకులు జి.సుబ్బారావు పోరాటస్ఫూర్తితో భవిష్యత్ ఉద్యమాలు, కార్యాచరణ కొనసాగిద్దామని సిఐటియు నేతలు స్పష్టం చేశారు. బుధవారం కార్మికనేత సుబ్బారావు అకాల మరణానికి సంతాపంగా మధురవాడ ద్రోణంరాజు కల్యాణ మండపంలో సంతాప సభ నిర్వహించారు. ముందుగా సుబ్బారావు చిత్రపటానికి బి.సూరమ్మ పూలమాల వేసి, నివాళు లర్పించారు. అనంతరం మున్సిపల్ అవుట్ సోర్సింగ్, ప్రజారోగ్య కార్మికులు, క్లాప్ డ్రైవర్స్ అంజలి ఘటించారు..ఈ సందర్భంగా సిఐటియు జోన్ ఉపాధ్యక్షులు, పి. రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి డి అప్పలరాజు మాట్లాడుతూ కార్మిక,ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించడమే కాకుండా కార్మికులను పోరాడే శక్తులగా తీర్చిదిద్దిన గొప్ప నాయకుడు సుబ్బారావు అన్నారు. సుబ్బారావు పోరాటస్ఫూర్తితో ఉద్యమాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా బాబూ జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బి రాంబాబు, టి గోవింద, వై చిన్న, ఎస్ ఆదిలక్ష్మి, యు లక్ష్మి, క్లాప్ డ్రైవర్స్ నాయకులు ఎస్ చిన్న, కె.సన్ని, ఎం రాజు, పి అశోక్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో విశాఖ క్రీడాకారుల ప్రతిభ



తైక్వాండో పతకాలు సాధించిన విద్యార్థులతో కోచ్‌లు

ప్రజాశక్తి -మధురవాడ : రాజస్థాన్‌లోని యూనివర్సిటీ ఆఫ్ కోటా వేదికగా నిర్వహించిన జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో రాష్ట్ర క్రీడాకారులు ఎనిమిది పతకాలను సాధించగా, వాటిలో మూడు పతకాలను విశాఖ క్రీడాకారులకు రావడం గర్వకారణమని, తైక్వాండో సంఘం ప్రధానకార్యదర్శి అచ్యుతరెడ్డి, జిల్లా కార్యదర్శి అచ్చింనాయుడు అన్నారు. బాలికల క్యాడెట్ విభాగంలో కె ధనలక్ష్మి స్వర్ణ పతకం సాధించగా, సబ్ జూనియర్ బాలుర విభాగంలో విశాల్, మహేశ్వరరావులకు కాంస్య పతకాలు వచ్చాయన్నారు. పతకాలు సాధించిన క్రీడాకారులను తైక్వాండో కోచ్ ఎం.సురేశ్, ఆంధ్రప్రదేశ్ జట్టు కోచ్ కె.సుకుమార్ సంపత్ అభినందించారు. విజేతలకు మధురవాడ శ్రీకనకదుర్గ క్యాటరింగ్ అధినేత కొర్రాయి సురేష్ విజేతలకు పతకాలు అందించి అభినందించారు.

చిన్నరెడ్డికి తెలుగురత్న అవార్డు



చిన్నరెడ్డిని సత్కరిస్తున్న ప్రముఖులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని తాటితూరు గ్రామానికి చెందిన ప్రముఖ జానపద కళాకారులు సరగడ చిన్నరెడ్డికి ఉత్తరాంధ్ర తెలుగురత్న అవార్డు దక్కింది. ఎపి భాషా, సాంస్కృతిక శాఖ సౌజన్యంతో 'జయహో భారతీయం' ఆధ్వర్యంలో విజయవాడ తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ఉగాది పర్వదినాన చిన్నరెడ్డి తెలుగు రత్న అవార్డు అందుకున్నారు. జానపదంలో జాలరి ప్రదర్శన, రైతు దయనీయ పరిస్థితిని తెలిపే ప్రదర్శనలకు ఈ అవార్డు లభించింది. జయహో భారతీయం ఆరవ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ఉగాది పురస్కారాల ప్రదానోత్సవంలో చిన్నరెడ్డితో పాటు విజయనగరం జిల్లా, బొబ్బిలికి చెందిన ప్రముఖ రంగస్థల కళాకారిణి గంటా మంగమ్మకు పౌరాణికంలో తెలుగురత్న అవార్డు దక్కింది. ఈ సందర్భంగా జరిగిన నాట్యోత్సవంలో నాట్యగురు అవార్డు గ్రహీత విశాఖ నగరానికి చెందిన ప్రముఖ నాట్య కళాకారిణి ఎ అరుణ ఆధ్వర్యంలో సుమారు వంద మంది చిన్నారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

బాలసుబ్రహ్మణ్యానికి పౌర సత్కారం

ప్రజాశక్తి -పద్మనాభం : పౌరాణిక పద్యరంగంలో డాక్టరేట్ పొందిన మద్ది గ్రామానికి చెందిన బాలసుబ్రహ్మణ్యంను బుధవారం సొంత గ్రామంలో ఘనంగా పౌరసన్మానం జరిగింది. స్థానిక కల్యాణమండపంలో సర్పంచ్ బి.సన్యాసమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో స్థానిక ఎంపిపి కె.రాంబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని, బాలసుబ్రహ్మణ్యంను ఘనంగా సత్కరించారు. బాలసుబ్రహ్మణ్యం తమ గ్రామస్తుడు కావడం ఎంతో గర్వంగా, ఆనందంగా ఉందన్నారు.

నెలాఖరులోగా పెండింగ్ బిల్లులు చెల్లించాలి

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలో పెండింగ్ బిల్లులన్నీ నెలాఖరులోగా చెల్లించాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అవినీతికి ఆస్కారం లేకుండా ఉద్యోగులంతా పనిచేయాలని సూచించారు. ఇప్పటివరకు ఇళ్ల నిర్మాణాలు చేపట్టని వారంతా వెంటనే పనులు చేపట్టేలా ప్రోత్సాహించాలని, ఈనెలాఖరుకు బిల్లులు ఇస్తామని వారికి భరోసానివ్వాలన్నారు. వైసిపి సోషల్‌మీడియా పనితీరు మెరుగుపరచాలని సూచించారు. ప్రభుత్వపరంగా ఎన్ని మంచిపనులు చేసినా, విపక్షాలు బురద చల్లే కార్యక్రమాలు ఉంటాయని, వాటిని పట్టించుకోవద్దని సూచించారు. ఈనెల 7 నుంచి 20వరకు జగనన్న నీవే మా భవిష్యత్ కార్యక్రమాన్ని గ్రామాల్లో నిర్వహించాలని సూచించారు.

చందనోత్సవ ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, సిపి, ఇతర అధికారులు

ప్రజాశక్తి- సింహాచలం: ఈనెల 23న నిర్వహించనున్న సింహాద్రి అప్పన్న చందనోత్సవ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున నగర పోలీస్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్, ఇతర పోలీసు, దేవస్థానం అధికారులతో కలిసి పరిశీలించారు. కల్యాణవేదిక, అక్కడికి వెళ్లే మార్గాలు, పార్కింగ్ ఏర్పాట్లకు సంబంధించి మాస్టర్ ప్లాన్ పరిశీలించారు. ఉచిత దర్శనంతోపాటు టిక్కెట్ దర్శనాలకు వేర్వేరుగా క్యూలైన్ల ఏర్పాట్లపై దేవస్థానం ఇఒ త్రినాథరావును అడిగి తెలుసుకున్నారు. భక్తులు క్యూలైన్లలో వేచియుండకుండా త్వరితగతిన సంతృప్తికర దర్శనం అయ్యేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. గతేడాది ఏర్పాట్లుతో సరిపోల్చి, ప్రస్తుత ఏర్పాట్లపై అధికారులను ప్రశ్నించారు. విఐపిలు, వివిఐపిలు, ప్రోటోకాల్ ప్రముఖుల దర్శనాల సమయంలో సామాన్యభక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో అప్పన్న ధర్మకర్తల మండలి సభ్యులు గంట్ల శ్రీనుబాబు, దినేష్ రాజ్, సంపంగి శ్రీనివాసరావు, దేవస్థానానికి చెందిన వివిధ విభాగాల అధికారులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాట్ల పరిశీలనకు వచ్చిన సిపి సిహెచ్.శ్రీకాంత్, జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్, డిసిపిలు సునీల్ సుమిత్, ఆనందరెడ్డి తదితరులు సింహాద్రి అప్పన్నను దర్శించుకున్నారు.

బక్రీద్ నాటికి ముస్లిములకు ఈద్గా స్థలం



ముస్లిములతో మాట్లాడుతున్న కెకె.రాజు

ప్రజాశక్తి -కంచరపాలెం : బక్రీద్ పండుగ నాటికి ముస్లిములకు ఈద్గా స్థలం కేటాయించేలా శక్తివంచన లేకుండా కృషి చేస్తామని ఉత్తర నియోజక వర్గం సమన్వయకర్త, రాష్ట్ర నెడ్‌క్యాప్ ఛైర్మన్ కెకె రాజు హామీ ఇచ్చారు. బుధవారం మర్రిపాలెం బిఆర్‌టిఎస్ రహదారికి అనుకొని ఉన్న ముస్లిం శ్మశానవాటికకు రూ.పది లక్షల వ్యయంతో చేపట్టనున్న రక్షణగోడ నిర్మాణానికి శంకుస్థాపన చేసారు. ఈసందర్భంగా మాట్లడుతూ, మర్రిపాలెం బిఆర్‌టిఎస్ రహదారి నిర్మాణ సమయంలో ముస్లిములు ఈద్గా స్థలం కోల్పోయారని, దీనిపై విశాఖ పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి జగన్ దృష్టికి తీసుకెళ్లడంతో ప్రత్యామ్నాయ స్థలం కేటాయించారన్నారు. ముస్లిములు నడక మార్గాన వెళ్లి ఈద్గా స్థలం వద్ద ప్రార్ధనలు, నమాజ్‌లు ఆచరిస్తారని, దీనికోసం సుదూర ప్రాంతానికి వెళ్లలేని స్థితిలో సమీప ఆర్‌అండ్‌బి స్థలంలో ఈద్గాకు స్థలం కేటాయించాలని వినతిపత్రం అందజేశామన్నారు. దీనిపై ముస్లిం మతపెద్దలతో కలిసి త్వరలో ఉత్తరాంధ్ర పార్టీ రీజనల్ ఇన్‌ఛార్జి వైవి.సుబ్బారెడ్డిని కలిసి విన్నవిస్తామన్నారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర నాయకుల ఫరూఖీ, వార్డు కార్పొరేటర్ బర్కత్ అలీ, వార్డు ఇన్‌ఛార్జి జి.వెంకటరెడ్డి, మసీదు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మంత్రి గారి వియ్యంకుడు సవాల్‌కు 'సై'

ప్రజాశక్తి- సీతమ్మధార: అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం చోడపల్లి గ్రామంలో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి వియ్యంకుడు కుండా భాస్కరరెడ్డి లేఅవుట్‌లో అక్రమాలు, కబ్జాలు నిరూపించేందుకు తాము సిద్ధమని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ సవాల్ విసిరారు. బుధవారం పౌరగ్రంథాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి అండదండలతో, అటవీ, రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారుల కనుసన్నల్లోనే చెరువు భూములను కబ్జా చేసి లేఅవుట్‌లో కలిపేసుకున్న భాస్కరరెడ్డి, నిబంధనలకు విరుద్ధంగా దానిచుట్టూ ప్రహరీ నిర్మించారన్నారు. అయితే ఒంగోలులో మీడియా సమావేశంలో భాస్కరరెడ్డి మాట్లాడుతూ, తన లేఅవుట్‌లో సెంటు భూమి అక్రమమైనా మొత్తాన్ని వదిలేసుకుంటామని సవాల్ చేశారని, దాన్ని స్వీకరించి, అక్రమాలను ఆధారాలతో నిరూపించేందుకు తాము సిద్ధమన్నారు. ప్రజల సమక్షంలో రెవెన్యూ , అటవీ , పంచాయతీరాజ్, పట్టణాభివృద్ధి శాఖల అధికారులు సంయుక్తంగా డిజిటల్ సర్వే నిర్వహించాలని, వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. డాక్యుమెంట్ల ఆధారంగా కొనుగోలు చేసిన భూమి ఎంత? ప్రస్తుతం లేఅవుట్‌లో ఉన్న భూమి విస్తీర్ణంతో పోలిస్తే అక్రమాలు, కబ్జాల బాగోతం బయటపడుతుందన్నారు. కబ్జా నిరూపితమైతే, చోడిపల్లి లేఅవుట్‌ను జగనన్న కాలనీకి అప్పగించడానికి సిద్ధమా అంటూ సవాల్ విసిరారు.

గురుకులాల్లో ప్రవేశానికి 24లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఎపి గురుకుల విద్యాలయాల సంస్థ నిర్వహణలో ఉన్న నర్సీపట్నం బాలురు, భీమిలి అచ్యుతాపురం బాలికల పాఠశాలల్లో 5 వ తరగతి ప్రవేశాలకు, 6,7,8 తరగతుల్లో మిగిలి ఉన్న సీట్ల భర్తీకి వచ్చేనెల 25న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఎపిఆర్ఇఎస్ జిల్లా కో ఆర్డినేటర్ కె రాంబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు https:aprs,Apcfss.in వెబ్‌సైట్ ద్వారా ఈనెల 4 నుంచి 24లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. మే 25 న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు..

అధికార దర్పం వద్దు : మంత్రి

అందరూ చందనోత్సవ టిక్కెట్లు కొనాల్సిందే...



కొట్టు సత్యనారాయణ

ప్రజాశక్తి- సింహాచలం: ఈ నెల 23న చందనోత్సవం రోజున సింహాద్రి అప్పన్న నిజరూప దర్శనానికి వచ్చే ప్రతి ఒక్కరూ టిక్కెట్ కొనుక్కుని స్వామిని దర్శించు కోవాలని దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ సూచించారు. విఐపిలు, ప్రముఖులెవరైనా అధికార దర్పం ప్రదర్శించి, దేవాలయంలో విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బందిని ఇబ్బందులకు గురిచేయవద్దని హితవు పలికారు. బుధవారం సింహాద్రి అప్పన్న దర్శనానికి వచ్చిన సందర్భంగా విలేకర్లతో మాట్లాడారు.కలెక్టరేట్‌లో వివిధ జిల్లాల శాఖ అధికారులతో చందనోత్సవ ఏర్పాట్లపై చర్చ సందర్భంగా దీనిపై స్పష్టమైన సూచనలిచ్చామన్నారు. రూవెయ్యి, రూ.1500 టిక్కెట్లు కొనుక్కునే వారికి దర్శనానికి ప్రత్యేక సమయాన్ని కేటాయిస్తామని, సామాన్య భక్తుల ఉచిత దర్శనానికే అధిక ప్రాధాన్యతనివ్వనున్నట్లు వెల్లడించారు. చందనోత్సవం సందర్భంగా స్వామి నిజరూప దర్శనానికి వచ్చే సామాన్య భక్తునికి సంతృప్తికరమైన దర్శనం, ఉచిత ప్రసాదం అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించామన్నారు. ఘాట్ రోడ్డు పనులను త్వరలోనే పూర్తి చేస్తామని ఒక ప్రశ్న సమాధానంగా మంత్రి తెలిపారు. మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా దేవాలయాన్ని అభివృద్ధి చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. కేంద్రప్రభుత్వం ప్రసాద్ పథకంలో భాగంగా రూ. 54 కోట్లతో త్వరలో పనులు ప్రారంభమౌతాయన్నారు. భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పనకు మరిన్ని నిధులను సమకూరుస్తామన్నారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ కమిషనర్ హరిజవహర్‌లాల్, ఇఒవి.త్రినాథరావు పాల్గొన్నారు. ముందుగా మంత్రి కొట్టు సత్యనారాయణ, కమిషనర్ హరిజవహర్‌లాల్‌లకు ఆలయ అర్చకులు సాంప్రదాయరీతిలో స్వాగతం పలకగా, స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

డిజిటల్ లెర్నింగ్ ఉపయోగకరం



ట్యాబ్‌లతో విద్యార్థులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : డిజిటల్ లెర్నింగ్ ఎంతో ఉపయోగకరమని ఐటి సెల్ స్టాటిస్టికల్ లెక్చరర్ సిహెచ్‌వి.రమేష్ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా 8వ తరగతి విద్యార్థులతో ట్యాబ్ ల వినియోగం వల్ల కలిగే ఉపయోగాలపై చర్చించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

'రసూల్ డెకర్' ఎదుట కార్మికుల ధర్నా

ప్రజాశక్తి- రాంబిల్లి

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఎస్ఇజెడ్‌లోని రసూల్ డెకర్ ప్లైవుడ్ కంపెనీ గేటు ముందు ముఠా కార్మికులు బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము మాట్లాడుతూ రసూల్ డెకర్ ప్లైవుడ్ కంపెనీలో 2019 నుండి దిబ్బపాలెం నిర్వాసితులు సుమారు వందమంది ముఠా కార్మికులుగా లోడింగ్, అన్లోడింగ్ పనులు చేస్తున్నారని తెలిపారు. ఈ పరిశ్రమకు వివిధ ప్రాంతాల నుండి వచ్చే కర్రలు లారీల నుండి రూ.500, వ్యాన్‌కు రూ.300, ట్రాక్టరుకు రూ.200 చొప్పున తీసుకొని జీవనం కొనసాగిస్తున్నారని చెప్పారు. అయితే నెలరోజుల క్రితం ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు కంపెనీకి వచ్చి యాజమాన్యంతో మాట్లాడి మామూళ్లు ఇవ్వవద్దని చెప్పడంతో యాజమాన్యం బయట బోర్డులు పెట్టి ముఠా కార్మికులు రావాల్సిన మామూళ్లు నిలుపుదల చేశారని పేర్కొన్నారు. దీంతో ముఠా కార్మికులు నెలరోజులు నుండి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భూములు కోల్పోయి, నిర్వాసితులుగా మారి, ముఠా కార్మికులుగా పని చేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారని తెలిపారు. పాత పద్ధతిలో లోడింగ్ అన్లోడింగ్ పనులు కొనసాగించాలని డిమాండ్ చేశారు. స్థానికులకు 75శాతం ఉపాధి కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం చట్టం చేసినా ప్రైవేటు యాజమాన్యాలు దానిని పక్కనపెట్టి, ఉన్న ఉపాధిని కూడా పోగొట్టే పద్ధతులు అనుసరించడం దారుణమన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం సమస్యలను పరిష్కరించాలని లేకుంటే కార్మికులను సమీకరించి పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నాకు తుమ్మల రాజు మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో వరహాల నాయుడు, గొర్లి నాగేష్, గుర్రం సూరిబాబు, గొర్ల సత్తిబాబు, ఎ.చిన్న అప్పలనాయుడు, ఎ.గోవిందరావు ముఠా కార్మికులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న రసూల్ డెకర్ ప్లైవుడ్ కంపెనీ ముఠా కార్మికులు


ఆందోళన చేస్తున్న నేవీ నిర్వాసితులు

సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం ఆగదు

ప్రజాశక్తి- రాంబిల్లి

తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం ఆగదని ఎన్ఎఒబి నిర్వాసితులు స్పష్టం చేశారు. మండలంలోని వాడనర్సాపురం వద్ద ఎన్ఎఒబి గేట్ ముందు నేవీ నిర్వాసితులు చేస్తున్న ఆందోళన బుధవారం నాటికి 150వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా నేవీ మెయిన్ గేటు ముందు 8 గ్రామాల ప్రజలు బైఠాయించి తమను న్యాయం చేయాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. బుధవారం ధర్నా శిబిరాన్ని సందర్శించిన స్థానిక ఎమ్మెల్యే యువి.రమణమూర్తిరాజు మాట్లాడుతూ రెండు గ్రామాలకు మాత్రమే ఉపాధి కల్పిస్తామని చెప్పారు. దీనిపై నిర్వాసితులు మండిపడ్డారు. మిగిలిన గ్రామస్తుల పరిస్థితి ఏమిటని కేజీ పాలెం గ్రామ సర్పంచ్ బద్ది హరిబాబు, అదే గ్రామానికి చెందిన పెద్ద పప్పల నూకన్నదొర ప్రశ్నించారు. మినిట్స్ కాపీలో ఉపాధి కల్పిస్తామని చెప్పి విషయాన్ని గుర్తు చేశారు. తమ సమస్యలను పరిష్కరించే వరకు టెంట్ తీసే ప్రసక్తే లేదంటూ స్పష్టం చేశారు.


కరెంట్ లేక విసన కర్రతో విసురుకుంటున్న రోగులు

ప్రభుత్వ ఆసుపత్రిలో తాగునీరు, కరెంటు కష్టాలు

ప్రజాశక్తి-యలమంచిలి రూరల్

యలమంచిలి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని తాగునీరు, కరెంట్ కష్టాలు వెంటాడుతున్నాయి. ఈ ఆసుపత్రికి నిత్యం వందలాది మంది రోగులు వైద్యం నిమిత్తం వస్తున్నారు. ఆసుపత్రిలో స్వచ్ఛమైన తాగునీరు లేక రోగులు, సహాయకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కొద్ది రోజులుగా ఎండలు మండుతుండడంతో తాగునీటిని కొనుక్కోవాల్సిన దుస్థితి నెలకొంది. తాగునీటి కష్టాలకు కరెంటు కోతలు కూడా తోడయ్యాయి. నిత్యం విద్యుత్ కోతల వల్ల ఉక్కపోతతో గాలి వేయక రోగులు నానా అవస్థలు పడుతున్నారు. విసన కర్రలతో గాలి విసురుకోవాల్సి వస్తుందని రోగుల సహాయకులు వాపోతున్నారు. నిత్యం వందలాది మంది వచ్చే ఆసుపత్రికి జనరేటర్, మినరల్ వాటర్ ప్లాంట్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జనరేటర్, మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని రోగులు కోరుతున్నారు.

ఆర్ట్స్ గ్యాలరీకి స్థలం కేటాయించాలని వినతి

ప్రజాశక్తి-చోడవరం

చోడవరం కేంద్రంగా అనకాపల్లి జిల్లా స్థాయి ఆర్ట్ గ్యాలరీని ఏర్పాటు చేయడానికి స్థలాన్ని కేటాయించాలని స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీకి ఫోరం ఫర్ బెటర్ సభ్యులు బుధవారం వినతి పత్రం అందించారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే ధర్మశ్రీ 10 సెంట్లు స్థలాన్ని కేటాయించాలని తహశీల్దారుకు సిఫార్సు చేశారు. నిర్మాణానికి కూడా సహకారం అందిద్దామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ గ్యాలరీలో యువతకు శిక్షణ ఇచ్చి చోడవరం ప్రాంతానికి మంచి పేరు తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కాసులమ్మ, చోడవరం చిత్రకళా నిలయం వ్యవస్థాపకులు సూర్యనారాయణ, ఫోరం ఫర్ బెటర్ సభ్యులు బిఎస్ ప్రసాద్, రిటైర్డ్ ఆర్‌జెడి తిరుపతిరావు, గాంధీ గ్రామం, నరసయ్య పేట సర్పంచులు అప్పారావు, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే ధర్మశ్రీకి వినతిపత్రం ఇస్తున్న ఫోరం ఫర్ బెటర్ సభ్యులు

ఆర్ఎస్ చానల్ ఆనకట్టకు గండి

ఆరు గ్రామాలకు అందని సాగునీరు - పునర్నిర్మించాలని కోరుతున్న రైతులు

ప్రజాశక్తి- చోడవరం

బుచ్చయ్యపేట, చీడికాడ మండలాలకు అనుసంధానంగా ఉన్న బొడ్డేరు నది వద్ద మంగళాపురం ఆర్ఎస్ ఛానల్ ఆనకట్టకు గత మూడేళ్ల క్రితం గండి పడటంతో సుమారు ఆరు గ్రామాలకు సాగునీరు అందకుండా ఉంది. ఒక ఏడాది మంగళాపురం, విజయరామరాజుపేట, గ్రామాలకు చెందిన రైతులు ఒక్కొక్కరు చందాలు వేసుకుని గండిని మట్టితో పూడ్చారు. ఏటి ప్రవాహం ఎక్కువ రావడంతో అది గెడ్డేది కొట్టుకుపోయింది. అప్పటినుండి నీరు రాకపోవడంతో సుమారు 3000 ఎకరాలకు సాగునీరు అందకపోవడంతో పొలాల బీడి వారి ఉన్నాయి. ఈ ఆనకట్ట కుడి, ఎడమల కాలువల ద్వారా బుచ్చయ్యపేట మండలంలోని మంగళాపురం, విజయరామరాజుపేట, కుముందాను పేట, చీడికాడ మండలంలో దిబ్బపాలెం, కట్టివాని అగ్రహారం, సురవరం, చోడవరం మండలంలోని లక్ష్మీపురం గ్రామాలకు సాగునీరు అందుతూ ఉంటుంది. మూడేళ్ల క్రితం గండి పడడంతో నాటి నుంచి వర్షాలు పడితే తప్ప ఆనకట్టు ఆయకట్టు కింద పంటలు పండని పరిస్థితి దాపురించిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆనకట్ట మాడుగుల, చోడవరం, నియోజకవర్గాలకు అనుసంధానంగా ఉంది. మాడుగుల ఎమ్మెల్యే బూడి ముత్యాలనాయుడు ప్రస్తుతం ఉప ముఖ్యమంత్రి హోదాలో ఉన్నారు. స్థానిక రైతులు ఆయన వద్దకు ఎన్నోసార్లు వెళ్లి తమ గోడు వెల్లబుచ్చుకున్నా ఫలితం లేకుండా పోయింది. కొత్త ఆనకట్ట నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని చెబుతున్నారే తప్ప పనులు మాత్రం కార్యరూపం దాల్చలేదు. ఈ ఏడాదైనా ఆనకట్ట నిర్మించి ఖరీఫ్ సాగుకు నీరు అందివ్వాలని రైతులు కోరుతున్నారు.


సాగునీరు రాక ఎండిపోయిన కాలువ

వివాహ రిజిస్ట్రేషన్ కోసం క్యూ


పిల్లాడితో పాటు వివాహ రిజిస్ట్రేషన్‌కు వచ్చిన మాణిక్యం, హేమలత

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట

ఈ ఫొటోలో కనిపిస్తున్న వారు పెద్దిరెడ్డి మాణిక్యం, ఆయన భార్య హేమలత, వారి కుమారుడు. వీరికి మూడేళ్ల క్రితం వివాహమైంది. ప్రస్తుతం కొత్త రేషన్ కార్డు కావాలంటే వివాహ రిజిస్ట్రేషన్‌ను ప్రభుత్వం తప్పనిసరి చేసింది. దీంతో వీరు చోడవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం చుట్టూ పలు మార్లు తిరిగి వివాహ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అన్ని రకాల ఖర్చులు కలిపితే రూ.3000కు పైగా ఖర్చయింది.

రేషన్ కార్డు దరఖాస్తులో వివాహ రిజిస్ట్రేషన్ నెంబర్ నమోదు చేయాల్సిన ఉండడంతో రెండు, మూడు సంవత్సరాల క్రితం వివాహం చేసుకున్న వారు సైతం వివాహ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తులు చేసుకుంటున్నారు. ఈ విధంగా మండలంలోని పలు గ్రామాలకు చెందిన 300 మందికి పైగా మ్యారేజ్ సర్టిఫికెట్ల కోసం చోడవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వివాహ రిజిస్ట్రేషన్ చేయించుకోవడం చాలా అరుదు. పెద్దగా ఆసక్తి చూపరు. ఇప్పుడు కొత్త రేషన్ కార్డుల కోసం వివాహ రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేయడంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. వివాహ రిజిస్ట్రేషన్ ప్రక్రియ మరింత వేగంగా జరిగేటట్లు చూడాలని పలువురు కోరుతున్నారు.

పాఠశాల శిథిల భవనాన్ని తొలగించాలని వినతి

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట


శిథిలావస్థలో ఉన్న మండలంలోని పి.భీమవరం శివారు గొన్నవానిపాలెం మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల భవనాన్ని తొలగించాలని పి.భీమవరం ఎంపిటిసి సభ్యులు దేవర అప్పారావు ఎంపిడిఒకు వినతిపత్రం అందజేశారు. ఈ పాఠశాలలో 1 నుండి 5వ తరగతి వరకు 24 మంది విద్యార్థులు ఉన్నారని, పాఠశాలలో ఉన్న రెండు భవనాల్లో ఒకటి పెచ్చులూడిపోయి, గోడలు బీటలువారి ప్రమాదకరంగా ఉందని తెలిపారు. ఎప్పుడు కూలిపోతుందో తెలియని ఆ భవనాన్ని తక్షణమే తొలగించాలని కోరారు.

తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే ట్రిబ్యునల్ కోర్టును ఆశ్రయించవచ్చు

ప్రజాశక్తి-అనకాపల్లి

సీనియర్ సిటిజన్స్ అయిన తల్లిదండ్రులను పిల్లలు నిర్లక్ష్యం చేస్తే ఆర్డీవో కోర్టును ఆశ్రయించవచ్చని జిల్లా ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ కె.ప్రసాద్ అన్నారు. స్థానిక వివి రమణ రైతు భారతి ఆడిటోరియంలో బుధవారం కెప్టెన్ అప్పారావు అధ్యక్షతన సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్డీవో కోర్టు ఇచ్చిన తీర్పు సంతృప్తికరంగా లేకపోతే జిల్లా కలెక్టరేట్‌కు అప్పీల్ చేసుకోవచ్చున్నారు. వృద్ధుల సమస్యలు ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 14567కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. అసోసియేషన్ సభ్యులు విల్లూరి రాము మాట్లాడుతూ 60 సంవత్సరాలు దాటిన సీనియర్ సిటిజన్స్‌కు ఆదాయ పరిమితి నిబంధన తొలగించి పింఛన్ మంజూరు చేయాలన్నారు. అనంతరం శ్రీగౌరీ ఉచిత వివాహ వేదిక కన్వీనర్ పెంటకోట సత్యనారాయణను సత్కరించారు. సమావేశంలో అసోసియేషన్ కార్యదర్శి భీశెట్టి కృష్ణప్పారావు, కోశాధికారి బీవీ రామప్పారావు, కేటీవీ సత్యనారాయణ, పి సత్యనారాయణ, బి శేషు, ఎంఎన్ఎస్ అప్పారావు, కాండ్రేగుల విశ్వేశ్వరరావు, చదరం కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


సత్యనారాయణను సన్మానిస్తున్న దృశ్యం



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

'గడప గడపకు' పునఃప్రారంభం

ప్రజాశక్తి - యలమంచిలి : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల మూలంగా నిలిపివేసిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని బుధవారం యలమంచిలి, చోడవరం నియోజకవర్గాల్లో ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు పునఃప్రారంభించారు. యలమంచిలిలో ఎమ్మెల్యే యువి.రమణమూర్తిరాజు ప్రభుత్వ ఆసుపత్రి నుండి కోమటి మీదుగా, సైతారుపేట రోడ్డు వరకు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేకూర్చిన లబ్ధి గురించి లబ్ధిదారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బోదెపు గోవింద్, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చోడవరం : మండలంలో చాకిపల్లి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ బుధవారం చేపట్టారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. అర్హులైన వారికి మరిన్ని పథకాలు తమ ప్రభుత్వం అందించడానికి సిద్ధంగా ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, వైస్ ఎంపీపీ బైన ఈశ్వర రావు కుమారి, తహశీల్దారు తిరుమల బాబు, ఇన్‌ఛార్జి ఎంపీడీవో చైతన్య, అధికారులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ద్వారకానగరం సమస్యలను పరిష్కరిస్తా

ప్రజాశక్తి-చోడవరం : పట్టణంలోని ద్వారకా నగరంలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. బుధవారం చోడవరం పంచాయతీ శివారు ద్వారకా నగరంలో ఆయన పర్యటించారు. ఇళ్ల స్థలాల కోసం ఎన్నో ఏళ్లగా ఎదురుచూస్తున్న పేదలతో ఆయన మాట్లాడారు. స్థలాల సమస్య కోర్టులో ఉన్నందున పరిష్కారం కోసం కొంత సమయం పడుతుందని చెప్పారు. ఈ లోగా నివాస ప్రాంతంలో సిసి రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి కుళాయిలు ఇప్పటికే కొంతమేరకు ఏర్పాటు చేశామని, మిగిలిన ప్రాంతానికి కూడా వీటిని సమకూరుస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, వైస్ ఎంపీపీ బైన కుమారి ఈశ్వరరావు, వైసిపి నాయకులు ఒరుగంటి నెహ్రూ, బండి శ్రీను, బగ్గు శ్యామల, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అర్హుల పింఛన్లు తొలగించడం అన్యాయం

ప్రజాశక్తి- అనకాపల్లి : తెలుగుదేశం పాలనలో మంజూరు చేసిన అర్హులైన ఆరు లక్షల పింఛన్లను వైసిపి ప్రభుత్వం తొలగించడం అన్యాయమని టిడిపి పార్లమెంటరీ నియోజకవర్గ మీడియా కోఆర్డినేటర్ కొణతాల వెంకటరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనర్హుల పింఛన్లను తొలగించినా తప్పు లేదని, అర్హులైన వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, కళాకారులు, హిజ్రాల పింఛన్లను వివిధ నిబంధనల పేరుతో రద్దు చేయడం దారుణమన్నారు. తక్షణమే తొలగించిన పింఛన్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

వృద్ధులు ఆరోగ్యంపై తగిన శ్రద్ధ వహించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : వయోవృద్ధులు తమ ఆరోగ్యంపై తగిన శ్రద్ధ వహించాలని ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రి ఆయుష్ వైద్యులు డాక్టర్ లావణ్య అన్నారు. స్థానిక జాగ్రీ క్లబ్ ఆవరణలో బుధవారం పెన్షనర్స్ సీనియర్ సిటిజన్స్ సమావేశంలో ఆమె పాల్గొని ఆయుర్వేద వైద్యంపై అవగాహన కల్పించారు. ఆయుర్వేదం ప్రాముఖ్యత, దినచర్య, రుతు చర్య, ఆహార నియమాలను వివరించారు. వార్ధక్యంలో వచ్చే ఆరోగ్య సమస్యలు, వాటి పరిష్కారాలను తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ లావణ్యను సీనియర్ సిటిజన్స్ సత్కరించారు.

విశాఖ వెళ్లి పింఛను అందజేత

ప్రజాశక్తి-యలమంచిలి రూరల్ : ఎలమంచిలి మున్సిపాలిటీ పరిధిలోని పింఛను లబ్ధిదారు విశాఖలో ఉండగా, వార్డు వాలంటీర్ అక్కడకు వెళ్లి పింఛను అందజేశారు. మున్సిపాలిటీ పరిధి పెద్దపల్లి సచివాలయం 20వ వార్డుకి చెందిన పైడడ దుర్గమ్మ మార్చి నెలలో మేడ మెట్లు నుండి జారీ పడిపోవడంతో ఆమెకు వెన్నెపూసకు గాయమైంది. దీంతో ఆపరేషన్ చేశారు. ప్రస్తుతం ఆమె విశాఖపట్నం జిల్లా శ్రీహరిపురంలోని వాళ్ల కుమారుడి దగ్గర బెడ్ రెస్ట్‌లో ఉంటుంది. దీంతో పెద్దపల్లి సచివాలయ వాలంటీర్ బొద్దపు కళావతి అక్కడకు వెళ్లి పింఛను అందించింది. గతంలో కూడా వాలంటీర్ కళావతి పలుమార్లు కేజీహెచ్ ఆసుపత్రికి వెళ్లి పెన్షన్ ఇచ్చారు.

డివిఎన్ విద్యార్థులపై ఎస్ఐ దురుసు ప్రవర్తన!

సస్పెండ్ చేయాలని రత్నాకర్, పరుచూరి డిమాండ్

ప్రజాశక్తి- అనకాపల్లి

స్థానిక డివిఎన్ కళాశాల విద్యార్థులపై ఎస్ఐ దివాకర్ దురుసుగా ప్రవర్తించడం పలు విమర్శలకు తావిస్తోంది. ఎస్ఐను సస్పెండ్ చేయాలని డివిఎన్ కళాశాల యజమాని, వైసిపి అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్, జనసేన నాయకులు పరుచూరి భాస్కరరావు డిమాండ్ చేశారు. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి... బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకల్లో భాగంగా స్థానిక చోడవరం బస్టాప్ వద్ద రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, కలెక్టర్, ఇతర అధికారులు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న సమయంలో జై జనసేన అంటూ నినాదాలు వినిపించాయి. అయితే పక్కనే ఉన్న డివిఎన్ కళాశాలకు చెందిన విద్యార్థులే నినాదం ఇచ్చి ఉంటాడని భావించిన మంత్రి అమర్నాథ్ ఎస్సై దివాకర్‌ను చూడండని ఆదేశించారు. దీంతో ఎస్సై దివాకర్ కళాశాల యాజమాన్యాన్ని సంప్రదించకుండానే లోనికి ప్రవేశించి విద్యార్థులను నోటికి వచ్చినట్టు దూషించి కాలర్ పట్టుకొని లాక్కొచ్చారు. ఈ సమయంలో ప్రిన్సిపల్ అడ్డుకున్నా వినిపించుకోలేదు. విషయం తెలుసుకున్న డిఎస్‌పి మల్ల మహేష్, సిఐ మోహన్‌రావు కళాశాలను సందర్శించారు. మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, రత్నాకర్‌తో చర్చించి విషయాన్ని ఎస్పీ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ సంఘటనపై రత్నాకర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఎస్ఐ దివాకర్‌ను సస్పెండ్ చేయాలి

డివిఎన్ కళాశాల విద్యార్థులపై దాడికి పాల్పడిన ఎస్సై దివాకర్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని ఆ కళాశాల యజమాని, వైసిపి పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకులు దాడి రత్నాకర్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ 1993 నుంచి కళాశాలను రాజకీయాలకు అతీతంగా నడుపుతున్నామని, ఇటువంటి సంఘటనలు ఎప్పుడు చోటు చేసుకోలేదని పేర్కొన్నారు. ఎస్సై దివాకర్ ప్రవర్తన పోలీస్ శాఖనే అసహ్యించుకునే విధానంగా ఉందన్నారు. ఎస్ఐతో పాటు మరో ఇద్దరు వ్యక్తులు కూడా కళాశాలలోకి ప్రవేశించి విద్యార్థులను కొట్టడం అమానుషమన్నారు.

జనసేన అంటే ఎందుకంత భయం?

జనసేన పార్టీ పేరు విన్నా, పార్టీ నినాదం విన్నా రాష్ట్ర పరిశ్రమల మంత్రి అమర్నాథ్‌కు ఎందుకు అంత భయమని జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పరుచూరి భాస్కరరావు ప్రశ్నించారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ కలెక్టర్ ఇతర జిల్లా స్థాయి అధికారుల సమక్షంలోనే మంత్రి అమర్నాథ్ విద్యార్థుల సంగతి చూడమని ఎస్సైని ఆదేశించడం ఎంతవరకు సమర్థనీయమన్నారు. విద్యార్థులపై దాడి చేసిన ఎస్ఐ దివాకర్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.



మీడియాతో మాట్లాడుతున్న దాడి రత్నాకర్

విద్యార్థులకు ఎస్ఐ బహిరంగ ఎస్సై క్షమాపణ చెప్పాలన్నారు.

సిపిఐ ఎంఎల్ ఖండన

కళాశాల విద్యార్థులు తమకిష్టమైన పార్టీకి జై కొడుతుంటే మంత్రి అమర్‌నాథ్, అధికారులు, పోలీసుల సమక్షంలోనే వైసిపి గుండాలు విద్యార్థులపై దాడి చేయడం హేయమైన చర్యని సిపిఐ ఎంఎల్ నాయకులు పిఎస్ అజయ్ కుమార్ విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పదేపదే హక్కులు, చట్టబద్ధ పాలన, ప్రజాస్వామ్యాన్ని వల్లెవేసిన వైసిపి నాయకులు అధికార మదంతో నేడు దౌర్జన్యాలకు పూనుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పోలీస్ అధికారులు మంత్రుల మెప్పుకోసం చట్టబద్ధమైన తన అధికారాలను దుర్వినియోగం చేయరాదని హితవుపలికారు.

ఆసరాతో డ్వాక్రా మహిళలకు మేలు



ఆసరా చెక్కు అందజేస్తున్న మంత్రి అమర్‌నాథ్

ప్రజాశక్తి - కశింకోట

వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్ఆర్ ఆసరా పథకం ద్వారా డ్వాక్రా మహిళలకు మేలు జరుగుతుందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ అన్నారు. కశింకోటలో బుధవారం జరిగిన ఆసరా సభ కశింకోట మండలంలో 13 కోట్ల 31 లక్షల రూపాయల చెక్కును డ్వాక్రా మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనానికి మేలు చేశారు కాబట్టే జగన్మోహన్ రెడ్డి ధైర్యంగా ఓటు అడుగుతున్నారని, చంద్రబాబు నాయుడు తన పదవీకాలంలో ప్రజలకు ఏం మేలు చేశాడని ఓటు అడగడానికి వస్తున్నాడని ప్రశ్నించారు. గత ఎన్నికలకు ముందు పసుపు, కుంకుమ కింద డబ్బులు బ్యాంకులో జమ చేస్తున్నామని చెప్పిన చంద్రబాబు ఆ మొత్తాన్ని డ్వాక్రా మహిళలు వినియోగించుకోలేని విధంగా ఆదేశాలు జారీ చేశారని ఎద్దేవా చేశారు. పసుపు కుంకుమ పేరుతో చంద్రబాబు మోసం చేస్తే... ఉప్పు, కారంతో ఆయనకు మహిళలు బుద్ధి చెప్పారని పేర్కొన్నారు. మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్య నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపిపి కలగా లక్ష్మి, జెడ్పిటిసి దంతులూరి శ్రీధర్ రాజు, వైసిపి రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్, జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లి బాబు, వైస్ ఎంపిపిలు నమ్మి మీనా, పెంటకోట జ్యోతి, సర్పంచ్ మంత్రి జయరజని, వైసిపి నాయకులు మలసాల కిషోర్, గొల్లివిల్లి శ్రీనివాసరావు, పెంటకోట శ్రీనివాసరావు, నమ్మి గణేష్ పాల్గొన్నారు.

గ్రామ వాలంటీర్లకు 3 నెలలుగా అందని వేతనాలు

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట

మండలంలోని చింతపాక గ్రామ సచివాలయం పరిధిలో పని చేస్తున్న చింతపాక, సీతయ్యపేట గ్రామ వాలంటీర్లకు మూడు నెలలుగా వేతనాలు చెల్లించలేదు. ఇచ్చే అరకొర వేతనం రూ.5000 కూడా చెల్లించకపోవడంతో వాలంటీర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చింతపాక గ్రామ సచివాలయ పరిధిలో 16 మంది గ్రామ వాలంటీర్లు పనిచేస్తున్నారు. వీరంతా ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు చేరవేస్తూ అధికార వైసిపికి చేదోడు వాదోడుగా ఉంటున్నారు. అయితే వీరికి మూడు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో పింఛను లబ్ధిదారులకు ఇవ్వాల్సిన ఏప్రిల్ నెల పింఛను డబ్బులు పంపిణీ చేయడానికి ఆసక్తి చూపలేదు. వీరు పంచాయతీ కార్యదర్శి నుండి పింఛను నగదును తీసుకోకుండా ఇళ్లకు వెళ్లిపోయారు. దీంతో స్థానిక సర్పంచ్ గులజాన శ్రీను వాలంటీర్లకు నచ్చజెప్పి పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు చేసినట్లు తెలిసింది. దీనిపై చింతపాక సచివాలయ కార్యదర్శి ఎ.కృష్ణవేణిని వివరణ కోరగా సిఎఫ్ఎంఎస్ పంచాయతీ లాగిన్‌లో సదరు వాలంటీర్ల వివరాలు కనిపించలేదని, అందువల్ల గౌరవ వేతనం బిల్లులు పెట్టలేదని తెలిపారు.



చింతపాక గ్రామ సచివాలయం

వైసిపి పాలనలో సంక్షేమం, అభివృద్ధి

రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్


ప్రజాశక్తి-అనకాపల్లి

వైసిపి ప్రభుత్వంతోనే సంక్షేమం అభివృద్ధి జరుగుతుందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ పేర్కొన్నారు. స్థానిక రింగ్ రోడ్‌లో పార్టీ కార్యాలయంలో బుధవారం జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం వచ్చిన దగ్గరనుంచి ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ఇంటింటికీ ప్రచారం చేయడం ఈ కార్యక్రమ ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్, పట్టణ అధ్యక్షులు మందపాటి జానకి రామరాజు, జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, కసింకోట జెడ్పిటిసి దంతులూరి శ్రీధర్ రాజు, కసింకోట ఎంపీపీ కలగా లక్ష్మి గున్నయ్య నాయుడు, పార్టీ మండల అధ్యక్షులు గొల్లవిల్లి శ్రీనివాసరావు, ఆళ్ల నాగేశ్వరరావు గైపూరి రాజు, కెయం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జీవనజ్యోతి బీమాతో కుటుంబాలకు భరోసా

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా పథకం ద్వారా కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడం జరుగుతుందని తుమ్మపాల ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస బ్యాంకు మేనేజర్ కుప్పిలి వెంకట శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని జగన్నాధపురం గ్రామంలో మృతి చెందిన బ్యాంకు ఖాతాదారుడు ముప్పల అప్పలనాయుడు భార్య లక్ష్మికి జీవనజ్యోతి బీమా సొమ్మును సర్పంచ్ ముప్పల రాము చేతుల మీదుగా బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా మేనేజర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలైన జీవన జ్యోతికి ఏడాదికి 436 రూపాయలు, ప్రధానమంత్రి జీవన సురక్ష ప్రీమియంకు 20 రూపాయల వార్షిక ప్రీమియం చెల్లించడం ద్వారా ఖాతాదారుల కుటుంబాలకు ఆర్థిక భరోసా ఇచ్చినట్టు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ మోటమర్రి శ్రీనివాసరావు, పాలకేంద్రం అధ్యక్షులు జోగినాయుడు, వెలుగు కోఆర్డినేటర్ శారద పాల్గొన్నారు.



బీమా చెక్కు అందజేస్తున్న బ్యాంకు అధికారులు

ప్రజాశక్తి
గురువారం 6 ఏప్రిల్ 2023

ఘనంగా జగ్జీవన్‌రామ్ జయంతి



నివాళి అర్పిస్తున్న మంత్రి అమర్, కలెక్టర్

భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ జయంతిని అనకాపల్లి, విశాఖ జిల్లాలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు చోట్ల జగ్జీవన్‌రామ్ విగ్రహాలు, చిత్ర పటానికి నివాళులు అర్పించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

అనకాపల్లి:భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ దేశం గర్వించదగ్గ మహోన్నత నేత అని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ పేర్కొన్నారు. జగ్జీవన్‌రామ్ 116వ జయంతి సందర్భంగా చోడవరం బస్ స్టాప్ సమీపంలో ఉన్న ఆయన విగ్రహానికి కలెక్టర్ రవి పఠాన్ శెట్టితో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. జెసి కల్పనా కుమారి, డిఆర్‌ఓ వెంకటరమణ, ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైసిపి నాయకులు దిలీప్ కుమార్, మందపాటి జానకి రామరాజు, కొణతాల మురళీకృష్ణ, మంగరాజు, మధుబాబు పాల్గొన్నారు.

జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గుండాల వీధి జీవీఎంసీ సచివాలయంలో జరిగిన జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు జెసి కల్పనా కుమారి పాల్గొని మాట్లాడారు. జెడ్‌పి వైస్ చైర్‌పర్సన్ బీవీ సత్యవతి, డిఆర్‌ఓ వెంకటరమణ, సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు అజయ్ బాబు, జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు. గవరపాలెం అరుంధతి నగర్‌లో జగ్జీవన్ రామ్ విగ్రహానికి వైసిపి పట్టణ అధ్యక్షులు మందపాటి జానకి రామరాజు పూలమాల వేసి నివాళులు అర్పించారు. గవరపాలెం అంబేద్కర్ కాలనీలో జగ్జీవన్ రామ్ విగ్రహానికి టిడిపి నాయకులు బిఎస్‌ఎంకే జోగినాయుడు నివాళు లర్పించారు. పార్టీ నాయకులు గణేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది, విజయరామరాజుపేటలో శ్రీఅరుంధతి సేవా సంఘం ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ విగ్రహానికి మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా అధ్యక్షులు ఏలుసూరి ఘాటీలు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. మోర్తా శ్రీనివాసరావు కేక్ కట్ చేశారు. సంఘం సభ్యులు కొండబాబు, అప్పారావు, వరహాలు పాల్గొన్నారు.

సబ్బవరం : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి ఇన్‌ఛార్జి హెచ్‌ఎం పి.రాధాకుమారి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు బిఎస్.గోవింద, కుమార్ ప్రకాష్ పాల్గొన్నారు. అమరపినివాని పాలెంలో ఎమ్మార్పీఎస్ నాయకులు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేశారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నియోజకవర్గం ఇన్‌ఛార్జిగొటివాడ సామ్రాట్ కుమార్ పాల్గొన్నారు.

మాడుగుల:మండలంలోని ఒమ్మలిలో బాబూ జగజీవన్ రామ్ జయంతి సందర్భంగా ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో విగ్రహానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గూడెపు హరికృష్ణ, మాజీ సర్పంచ్ నందారపు సన్యాసిరావు, ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు ఎలుసూరి ఘాటీలు, కొండలరావు మాస్టారు, జి.అప్పారావు, బుజ్జి, అప్పలనాయుడు, రాజేష్, ఆనందరావు పాల్గొన్నారు.

నక్కపల్లి:మండలంలోని చినదొడ్డిగల్లు శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి కె.జనార్దన్ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ అప్పలరాజు, ఉపాద్యాయులు పాల్గొన్నారు.

గొలుగొండ:మండలంలోని మేజర్ పంచాయతీ ఏఎల్‌పురంలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్, అనకాపల్లి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షురాలు లోచల సుజాత బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని కోరారు. ఎంపిటిసి చింతల బుల్లిప్రసాద్ పాల్గొన్నారు.

కొంగసింగిలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఎంపిపి గజ్జలపు మణికుమారి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. డిహెచ్‌పిఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ రాజబాబు, జిల్లా డిహెచ్‌పిఎస్ అధ్యక్షులు శివప్రకాష్‌మాస్టార్, జిల్లా కార్యదర్శి లావరాజు పాల్గొన్నారు.


మండలంలోని కొత్తమల్లంపేటలో జగ్జీవన్‌రామ్ యువజన సంఘం ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంపిపి గజ్జలపు మణికుమారి, ఎస్సై నారాయణరావులు జగ్జీవన్ రామ్, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఎంపీపీ మణికుమారి మాట్లాడారు. ఎస్సై నారాయణరావు, డిహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు ప్రకాశరావు, డిసిహెచ్ రాజబాబు, అంబేద్కర్ ఇండియా మిషన్ (ఏఐఎం) మండల అధ్యక్షులు ఎన్.చిరంజీవి, ఏఐవైఎఫ్ నాయకులు వై.రాధాకృష్ణ, జగజ్జీవన్ రామ్ యువజన సంఘం నాయకులు, సంఘం సంఘం ప్రెసిడెంట్ పెదపూడి రమణ, మోర్త ఏసుబాబు, కోరుబెల్లి నానిబాబు, పెద్దాడ చిన్నాలు, మోర్త జానకిరావు, కోరుబెల్లి అప్పారావు, మోర్తా కృపారావు, మోర్తా ప్రకాష్, కోరుబెల్లి రాజు, కోరుబెల్లి ప్రకాష్, పెద్దడ అచ్చిరాజు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణ

కోటవురట్ల:మండలంలో కైలాసపట్నం గ్రామంలో ఎమ్మెల్యే గొల్ల బాబురావు జగ్జీవన్ రామ్ విగ్రహావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డివి సూర్యనారాయణరాజు, జడ్పిటిసి సభ్యురాలు సిద్ధబత్తుల ఉమాదేవి, సర్పంచ్ పెన్నాడ నూకరత్నం, మాజీ జెడ్పిటిసి సభ్యురాలు వెంకటలక్ష్మి, మాజీ సర్పంచ్ నాగేశ్వరరావు, నాయకులు సత్తిబాబు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.మండల కేంద్రంలో టిడిపి మండల అధ్యక్షుడు జానకి శ్రీను, తెలుగు యువత అధ్యక్షులు తిరుమలరావు, టిడిపి కార్యకర్తలు ఘనంగా నివాళులు అర్పించారు. వెంకటాపురం గ్రామంలో జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు(వైసీపీ అనుబంధం) పైల రమేష్ నివాళు లర్పించారు.

భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డైట్‌లో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ యు.మాణిక్యంనాయుడు, అధ్యాపకులు నాగేశ్వరరావు, మహాలక్ష్మి, షేక్ అల్లాఉద్దీన్, సోమయాజులు పూలమాలలు వేసి నివాళులర్పించారు పొట్టి శ్రీరాములు జివిఎంసి హైస్కూల్‌లో నిర్వహించిన బాబూజీ జయంతి కార్యక్రమంలో ఆదర్శ హిందీ ప్రేమీ మండలి గౌరవాధ్యక్షులు గంటా నూకరాజు, అధ్యక్షులు కెఎస్‌ఆర్ కృష్ణారావు, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, ఇ వెంకటరావు, లక్ష్మి పాల్గొన్నారు.

జివిఎంసి ఒకటో వార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం అప్పలరాజు, ఉపాధ్యాయులు ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పించారు. స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన జగ్జీవన్‌రామ్ జయంతిలో మూడోవార్డు వైసిపి అధ్యక్షులు అలిపిల్లి నరసింగరావు, పార్టీ నాయకులు మధునాయుడు, గౌరి నాయుడు పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బాబూజీ చిత్రపటానికి ఎంపిడిఒ వెంకటరమణ నివాళు లర్పించారు.



గొలుగొండ మండలంలో నివాళి అర్పిస్తున్న నేతలు

పద్మనాభం : మండలంలోని పెంట గ్రామం దళితవాడలో బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఎంఆర్‌పిఎస్ ఉత్తరాంధ్ర నాయకులు దేవరపల్లి గణేష్ ఆధ్వర్యంలోశ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో దళిత నాయకుడు కె.దేవుడు. డి.రవణమ్మ, కె.బంగారమ్మ పాల్గొన్నారు,

సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గ వైసిపి కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నియోజకవర్గ సమన్వయకర్త కెకె.రాజు పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, జివిఎంసి డిప్యూటీ ఫ్లోర్‌లీడర్లు కంపా హనోక్, అల్లు శంకరరావు, స్టాండింగ్ కమిటీ సభ్యులు సారిపిల్లి గోవింద్, బర్కత్‌ఆలీ, కార్పొరేటర్లు సాడి పద్మారెడ్డి, ఆళ్ల లీలావతి శ్రీనివాస్, కటిపాము కామేశ్వరి, వావిళ్ళపల్లి ప్రసాద్, రెయ్యి వెంకటరమణ పాల్గొన్నారు.

ఎంవిపి కాలనీ : ఎయులో బాబూజీ విగ్రహానికి రెక్టార్ ఆచార్య కె.సమత పూలమాలలు వేసి నివాళు లర్పించారు. రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, డాక్టర్ టి.షారోన్ రాజు పాల్గొన్నారు. ఆచార్య టి.వి.కృష్ణ రచించిన సోషియో పొలిటికల్ ఐడియాలజీ అండ్ లీడర్‌షిప్ ఆఫ్ బాబు జగ్జీవన్‌రామ్ పుస్తకాన్ని రెక్టార్ ఆచార్య సమత ఆవిష్కరించారు. అనంతరం లిమ్కాబుక్ ఆఫ్ రికార్డ్‌లో స్థానం సాధించిన ఎయు ఉద్యోగి చెన్నా అప్పలరాజును సత్కరించారు.

విశాఖపట్నం : బీచ్ రోడ్డులోని విశాఖ మ్యూజియం వద్ద బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లిఖార్జున, జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాధన్, నగర మేయర్ గొలగాని హరివెంకట కుమారి, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ జె.సుబద్ర, రెల్లి కార్పొరేషన్ చైర్మెన్ వి.మధుసూదనరావు, డిప్యూటీ మేయర్ కె.సతీష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టరు రమణమూర్తి ఆధ్వర్యాన జయంతిని నిర్వహించారు.

కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థలో బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి సంస్థ డైరెక్టర్లు డి.చంద్రం, ఎవివి సూర్యప్రతాప్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్లు ఎ.రవికుమార్, బి.రామచంద్రప్రసాద్, ఎం.రామకృష్ణ, ఎం.రవీంద్ర పాల్గొన్నారు. ఫిషింగ్ హార్బర్ బీచ్ రోడ్‌లోని బ్రిడ్జి స్కూల్ ఆవరణలో బాల వికాస్ ఫౌండేషన్ కార్యదర్శి నరవ ప్రకాశ రావు నివాళులర్పించారు. అనంతరం జన శిక్షణ సంస్థాన్‌లో కుట్టు శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నేతలు

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

ప్రజాశక్తి-గొలుగొండ:ప్రభుత్వ సంక్షేమ పథకాలను గృహసారధులు వివరించాలని జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపిపి గజ్జలపు మణికుమారి, వైసిపి మండలాధ్యక్షులు లెక్కల సత్యనారాయణ కోరారు. మండలంలోని పుత్తడిగైరంపేట, పాతమల్లంపేట గ్రామాల్లో గృహసారధులు, వలంటీర్లతో బుధవారం సమావేశమయ్యారు. ఈ నెల 7 నుంచి ప్రతీ ఇంటికి వెళ్లి ముఖ్యమంత్రి వైయస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. అనంతరం వారి అభిప్రాయాలను తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ల సంఘం అధ్యక్షులు కొరుప్రోలు పాణి శాంతారామ్, గృహసారధులు పాల్గొన్నారు.

చంద్రబాబు సమావేశానికి నేతల హాజరు

ప్రజాశక్తి-కోటవురట్ల:టిడిపి జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విశాఖలో బుధవారం నిర్వహించిన ఉత్తరాంధ్ర జోనల్ మీటింగ్ కు కోటవురట్ల టిడిపి నాయకులు జానకి శ్రీను, ఎంపీటీసీ సభ్యులు సూర్యారావు, మండల తెలుగు యువత అధ్యక్షులు తిరుమలరావు, బోడపాలు మాజీ సర్పంచ్ సత్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల టిడిపి అధ్యక్షులు జానకి శ్రీను మాట్లాడుతూ, ఇటీవల ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపొందడంతో పార్టీలో శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెల కొందన్నారు.



హాజరైన నాయకులు



పాల్గొన్న ప్రజలు

ఉపమాకలో అన్న సమారాధన

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని ఉపమాక (లక్ష్మణేశ్వరస్వామి దేవస్థానం) శివాలయం వద్ద బుధవారం శివపార్వతుల కల్యాణోత్సవాలు ముగింపు సందర్భంగా భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. ఈనెల 1వ తేదీ నుండి ప్రారంభమైన శివపార్వతుల కళ్యాణ మహోత్సవములు 5వ తేదీ బుధవారం రాత్రితో ముగిసాయి. బుధవారం ఉదయం ఆలయంలో మహా పూర్ణహుతిని ఆలయ అర్చకులు మహేష్ నిర్వహించారు.ఆలయంలో పుష్ప యాగోత్సవం పవళింపు సేవ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చెరుకూరి వెంకటేశ్వరరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ఎండిన చెట్టు

ప్రజాశక్తి -కోటవురట్ల:

మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం సమీపంలో ప్రధాన రహదారిని ఆనుకుని చింతచెట్టు ఎండిపోయి గడిచిన ఏడాదికాలంగా దర్శనమిస్తోం., అయినా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం పట్ల స్థానికులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ప్రధాన రహదారి కావడంతో వాహనాలతో పాటు నిత్యం రద్దీగా ఈ ప్రాంతం ఉంటుంది. అదేవిధంగా కళాశాల, పాఠశాల విద్యార్థులు, అటు ఇటు తిరుగుతూ ఉంటారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఏ క్షణానైనా కూలే అవకాశం లేక పోలేదు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఎండిపోయిన చెట్టుని తొలగించాలని ఆయా ప్రాంత వాసులు కోరుతున్నారు.



రోడ్డు పక్కన ఉన్న భారీ వృక్షం

మామిడి,జీడి రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:

మామిడి, జీడి రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.వి.ప్రసాద్ కోరారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, అనకాపల్లి జిల్లా సమావేశం స్థానిక కృష్ణా ప్యాలెస్‌లో జరిగింది. ఈ సమావేశం గొలుగొండ మండలం సిపిఐ నాయకులు నూకినాయుడు అధ్యక్షతన జరిగింది. ముందుగా బాబు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా నివాళు లర్పించారు. తాత్కాలిక నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా రెడ్డిపల్లి అప్పలరాజు, ఉపాధ్యక్షులుగా గొల్లు గురుబాబు, వేచలపు కాసుబాబుగా మాకిరెడ్డి రాజుబాబు, గొల్లు మాణిక్యం, సహాయ కార్యదర్శులుగా మర్రిబాబులు, కోరిబిల్లి శంకరరావు, రౌతు రామచంద్రరావు, కోశాధికారిగా కామిరెడ్డి లక్ష్మీ, జిల్లా సమితి సభ్యులుగా పోతురాజు, మళ్ల మాధవరావు, మర్రి అప్పలనాయుడు, అచ్యుతరావు, రాజాబాబు, రావాడ వరహాలు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సిపిఐ అనకాపల్లి జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకట రమణ, జిల్లా సహాయ కార్యదర్శులు మాకిరెడ్డి రామునాయుడు, రాజాన దొరబాబు, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులురావు, జగ్గారావు, జిల్లా ఉపాధ్యక్షులు వెలుగుల అర్జున్‌రావు పాల్గొన్నారు.

వెల్ఫేర్ అసిస్టెంట్‌పై విచారణ

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని కృష్ణదేవిపేట గ్రామ సచివాలయ పరిధిలో అర్హత ఉన్న వారికి చేదోడు పథకం అందించక పోవడంపై లబ్ధిదారులు స్పందనలో కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అధికారులు విచారణ చేపట్టారు. కృష్ణదేవిపేట గ్రామ సచివాలయంలో పని చేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ సిహెచ్.అప్పలనాయుడు ఈ గ్రామంలో అర్హత ఉన్న వారికి ప్రభుత్వ పథకాలు అందకుండా కక్షపూరితంగా వ్యవహిస్తున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదులు చేశారు. దీంతో గ్రామ, వార్డు సచివాలయ నోడల్ అధికారి మంజులవాణి కృష్ణదేవిపేటలో విచారణ నిర్వహించారు. ఈ గ్రామంలో సుమారుగా 10 మందికి గత రెండు సంవత్సరాలు టైలరింగ్‌లో చేదోడు పథకంలో భాగంగా సహకారం అందింది. 2022-23లో వీరికి ఈ పథకం అందక పోవడంపై గ్రామ సచివాలయంలో విచారణ నిర్వహించారు. ఈ విచారణలో లబ్ధిదారులకు అన్ని అర్హతలు ఉన్నట్లు గుర్తించారు. పూర్తి నివేదిక తయారీ చేసి వెల్ఫేర్ అసిస్టెంట్‌పై శాఖాపరమైన చర్యలకు ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తున్నట్లు విచారణ అధికారి తెలిపారు.

వైద్యురాలికి కరోనా

ప్రజాశక్తి-కోటవురట్ల:మండల కేంద్రంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో విధులు నిర్వహిస్తున్న చంటి పిల్లల డాక్టర్ గోదాదేవి రెండు రోజులుగా కొద్దిపాటి జ్వరంతో బాధపడుతున్నారు. దీంతో బుధవారం ఆమెకు అనుమానంతో పరీక్షలు నిర్వహించగా పాజిటివ్ గా నిర్ధారణ అయినట్లు సిహెచ్సి మెడికల్ ఆఫీసర్ రాజ్యలక్ష్మి తెలిపారు. సిబ్బందిని అప్రమత్తం చేయడంతో పాటు పరిసర ప్రాంతాలను శానిటైజ్ చేసినట్లు తెలిపారు. ప్రజలు కూడా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు..

చలో ఢిల్లీకి మద్దతుగా సిఐటియు ధర్నా

-మోడీ విధానాలపై ఐక్యపోరు

-సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న ఆర్‌కెఎస్‌వి.కుమార్



ధర్నా వద్ద ఏర్పాటుచేసిన కళా రూపాలు

ప్రజాశక్తి-యంత్రాంగం

కలెక్టరేట్, విశాఖ : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సిఐటియు, వ్యవసాయ కార్మికసంఘం, రైతు సంఘం కలిసి ఢిల్లీలో బుధవారం చేపట్టిన మజ్దూర్ కిసాన్ సంఘర్షణ ర్యాలీకి మద్దతుగా జివిఎంసి గాంధీవిగ్రహం వద్ద సిఐటియు విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదానీ, అంబానీకి దేశ సంపదను కట్టబెడుతున్న మోడీ తీరును కళ్లకు కట్టేలే ఏర్పాటుచేసిన కళారూపాలు, స్కీంవర్కర్లు, అసంఘటితరంగ కార్మికుల డిమాండ్ రూపాలు ఆకట్టుకున్నాయి. ప్రజానాట్యమండలి కళాకారులు పాటలు పాడారు. ఈ ధర్నానుద్దేశించి సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ, ఐక్యంగా ఉద్యమించి మోడీ విధానాలను ఎండగడతామని స్పష్టం చేశారు. కార్మిక చట్టాలను రద్దుచేసి కార్మికులకు నష్టంచేసే 4 లేబర్ కోడ్‌లను తెచ్చిందన్నారు. రైతులకు నష్టంచేసే చట్టాలను తెచ్చి వారి పోరాటంతో వెనక్కు తగ్గిందని తెలిపారు.కార్మికులకు నెలకు కనీసవేతనం రూ.26వేలు, కనీస పెన్షన్ రూ.10వేలు అమలు చేయడం లేదన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమానపనికి సమానవేతనం కూడా లేదన్నారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, డైలీవేజ్ పేరుతో కార్మికుల శ్రమను దోపిడీచేస్తోందని విమర్శించారు. యువతకు ఉపాధికల్పన మాటేలేదన్నారు. ఆశా, అంగన్‌వాడీ, మిడ్డేమీల్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్‌చేశారు. 2024 ఎన్నికల్లో కార్మికులు, రైతుల సమస్యలు పరిష్కారం అయ్యేవిధంగా ఎన్నికల ఎజెండాగా ముందుకు తీసుకుపోయేందుకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పి.మణి, షిప్‌యార్డు యూనియన్ నాయకులు ప్రసాద్, కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ నాయకులు ఆర్.లక్ష్మణమూర్తి, జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి యు.రాజు, అంగన్‌వాడీ, ఆశా, మిడ్డేమీల్ యూనియన్ నాయకులు శ్రీదేవి, సరస్వతి, దేవి, చినతల్లి, తోటమ్మ, రాము, వెంకటలక్ష్మి, డి.అప్పలరాజు, డి.కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఐక్య ఉద్యమాలతో ప్రతిఘటించండి

ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అస్థిరపరిచే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలతో ప్రతిఘటించాలని స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ పిలుపునిచ్చారు. న్యూఢిల్లీలో "మజ్దూర్ కిసాన్ సంఘర్ష మార్చ్"కు సంఘీభావంగా స్టీల్ సిఐటియు ఆధ్వర్యాన స్టీల్‌ప్లాంట్ టిటిఐ కూడలి వద్ద ధర్నా నిర్వహించారు. ప్రభుత్వ, యాజమాన్యాలకు వ్యతిరేకంగా కార్మికులు పెద్ద ఎత్తున నినదించారు. ఈ సందర్భంగా అయోధ్యరామ్ మాట్లాడుతూ, ప్రభుత్వ అధీనంలో ఉన్న ముడి సరుకులను అందించకుండా ఉద్దేశపూర్వకంగానే విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను నష్టాల్లోకి నెడుతోందని విమర్శించారు. ప్రభుత్వం సహకరిస్తే ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడిపి సాలీనా రూ.50 వేల కోట్ల టర్నోవర్‌ను సాధించి రూ.9వేల కోట్లను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు అందించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటి దాస్, సిఐటియు నగర అధ్యక్షులు కెఎం.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ఎన్ రామారావు, స్టీల్ సిఐటియు నాయకులు డి.కృష్ణమూర్తి, యు.వెంకటేశ్వర్లు, నీలకంఠం, భానుమూర్తి, గడా వెంకటేశ్వరరావు, చిరంజీవి, వివిధ విభాగాల అధ్యక్ష కార్యదర్శులు, కార్మికులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వర్గీయులు, వీసం మధ్య ఘర్షణ

-పలువురు నేతలకు స్వల్ప గాయాలు

-ఎమ్మెల్యే వర్గీయుల తీరుపై ధర్నా

-పోలీసులకు ఫిర్యాదు చేసిన ఎంపీపీ



ఘర్షణ పడుతున్న ఇరు వర్గీయులు

ప్రజాశక్తి- నక్కపల్లి:మండల కేంద్రమైన నక్కపల్లిలో బుధవారం ఎస్సీ కాలనీలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే బాబురావు వర్గీయులు, వ్యతిరేక వర్గీయులు వీసం మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా స్థానిక దళిత యువకులు ఎమ్మెల్యే బాబురావు, ఆయన వర్గీయులను, వ్యతిరేక వర్గీయులైన రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణతో పాటు తెలుగుదేశం, బిజెపి, ఇతర పార్టీల నేతలను ఆహ్వానించారు. ఎమ్మెల్యే గొల్ల బాబురావు ముందుగా బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి, ఆయన వర్గీయులతో సభ వేదిక వద్దకు వెళ్లారు. అనంతరం రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ వర్గీయులు ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జడ్పీటీసీ కాసులమ్మ, గ్రామ సర్పంచ్ జయ రత్న కుమారి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు వీసం నానాజీ, ఈశ్వరరావు, పార్టీ మండల శాఖ అధ్యక్షులు పాపారావు, మణి రాజు, తదితరులు బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే చెంగల వెంకట్రావు కూడా ఈ కార్యక్రమానికి హాజరై నివాళులర్పించారు.

స్థానిక దళిత నాయకులు, మహిళలు వీసం వెంట ఉండి ఊరేగింపుగా వీసం రామకృష్ణ వర్గీయులను వేదిక మీదకు వెళ్లారు. వీసం రామకృష్ణ మైక్ తీసుకొని ప్రోటోకాల్ ప్రకారం అందరిని వేదికపై పిలుస్తుండగా, ఎమ్మెల్యే వ్యతిరేక వర్గీయులు పిలవకుండా స్టేజ్ పైకి రావడంతో వీసం అభ్యంతరం చెప్పడంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఎమ్మెల్యే సమక్షంలో ఇరు వర్గాల నేతల మధ్య వాగ్వాదాలు, తోపులాట జరిగింది. ఉద్రిక్తత వాతావరణంలో గొడవ జరుగుతుండగా ఎమ్మెల్యే బాబురావును పోలీసులు అక్కడ నుండి కారు వద్దకు తీసుకువెళ్లి పంపించారు. దీంతో, వీసం వర్గీయులు జాతీయ రహదారిపై ఆందోళనకు దిగారు. గొడవకు కారణమైన ఎమ్మెల్యే వర్గీయులను శిక్షించాలని డిమాండ్ చేస్తూ జాతీయ రహదారిని దిగ్బంధించారు. జాతీయ రహదారిపై భారీగా వాహనాలు నిలిచి పోయాయి. అనంతరం వీసం వర్గీయులు ఎంపీపీ రత్నం, సర్పంచ్ జయ రత్నకుమారి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు వీసం నానాజీ, శ్రీను, రాజులతో పాటు బాబు జగ్జీవన్ రామ్ దళిత యూత్, మహిళలు పెద్ద సంఖ్యలో పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఆందోళన చేసారు. గొడవకు కారణమైన ఎమ్మెల్యే వర్గీయులపై చర్యలు తీసుకోవాలని పెద్ద పెట్టున నినాదాలు చేసారు. ఈ ఘర్షణలో వీసం రామకృష్ణ, ఎంపీపీ రత్నం, పాపారావు, మణి రాజులకు స్వల్ప గాయాలయ్యాయి.



ధర్నా చేపడుతున్న నేతలు

పోలీసులకు ఎంపీపీ రత్నం ఫిర్యాదు

ఎమ్మెల్యే బాబురావు వర్గీయులు యలమంచిలి తాతబాబు, శీరం నరసింహమూర్తి, కోర్ని రమేష్‌లు స్టేజి మీదకు పిలవకుండా వచ్చి ఘర్షణకు దిగారని, తనతో పాటు పలువురు నేతలకు గాయాలయ్యాయని, ఇందుకు కారణమైన వారిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఎంపిపి రత్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎంపీపీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే వర్గీయులైన ముగ్గురు నాయకులపై కేసు నమోదు చేయాలని ఎమ్మెల్యే వ్యతిరేక వర్గీయులు పట్టుబట్టారు. ఉదయం పోలీసులకు ఫిర్యాదు ఇచ్చిన దగ్గర నుండి రాత్రి 9 గంటల వరకు కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన కొనసాగించారు.ఈ మేరకు ఎస్ఐ శిరీష కేసు నమోదు చేసినట్లు వెల్లడించడంతో ఆందోళన విరమించారు .

ప్రభుత్వ భూముల ఆక్రమణకు

అధికార పార్టీ నేతల ప్రయత్నాలు

-కొండ పోరంబోకు భూమి ఆక్రమణకు వివాదాస్పద భూమి కొనుగోలు

-చదును పనులను నిలిపి వేసిన అధికారులు

ప్రజాశక్తి- గొలుగొండ: మండలంలో ప్రభుత్వ భూముల అయిన కొండా పోరంబోకు, గోర్జులను ఆక్రమించడానికి నర్సీపట్నంకు చెందిన అధికార పార్టీ నేతలు ప్రారంభించారు. అందుకోసమే ప్రత్యేకంగా ఆర్డిఓ కోర్టులో వివాదస్పదంగా ఉన్న భూమి కొనుగోలుకు ఆ నేతలు అడ్వాన్సులు కూడా చెల్లించారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి.

గొలుగొండ మండలం గొలుగొండ రెవెన్యూకు చెందిన 490 సర్వే నెంబరులో ఉన్న 3ఎకరాల 63 సెంట్లు భూమికి సంబంధించి వారసుల మధ్య వచ్చిన గొడవల కారణంగా వివాదాస్పదం కావడంతో గత మూడు సంవత్సరాలుగా నర్సీపట్నం ఆర్డీవో కోర్టులో ఉంది. ఈ భూమికి తూర్పు, పడమర, దక్షిణ దిశల్లో కొండపోరంబోకు, గోర్జు భూములు ఉన్నాయి. దీంతో నర్సీపట్నంకు చెందిన అధికార పార్టీలో ఉన్న ఇద్దరు నేతలు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడానికి వివాదాస్పద భూమిని కొనుగోలు చేసుకుంటే ప్రభుత్వ భూములు కూడా ఆక్రమించుకొని వ్యాపారం చేసుకొని లక్షల రూపాయలు సొమ్ము చేసుకోవచ్చు అనే ఉద్దేశంతో ఈ భూమి కొనుగోలుకు ప్రయత్నాలు చేశారు. అధికారంలోనే ఉన్నాం కదా అధికారులు మన మాటలు వింటారనే ధైర్యంతో ఈ భూమి కొనుగోలుకు ముందుకు వచ్చారు. వివాదాస్పద భూమికి ఆనుకుని తూర్పు వైపు 489-3 సర్వే నెంబరులో 9.43 ఎకరాల కొండ పోరంబోకు, దక్షిణ పడమరల వైపు 489-2 సర్వే నెంబర్లు 4.52 ఎకరాల ప్రభుత్వ భూమి(గోర్జు) లు ఉన్నాయి. దీంతో నర్సీపట్నంకు చెందిన ఇద్దరు అధికార పార్టీ నేతలు జనవరి నెలలో ఈ వివాదాస్పద భూమిని సుమారు కోటి రూపాయలకు కొనుగోలు చేసుకోవడానికి బేరసారాలు కుదిరి, 20 లక్షల రూపాయలు ఒక వర్గానికి చెందిన వారసులకు అడ్వాన్స్ చెల్లించారు. మంగళవారం వారు భూమిని చదును చేసే క్రమంలో ప్రభుత్వ భూములు కూడా కలుపుకొని వాహనాలతో భూమిని చదును చేయించారు. ఆర్డీవో కోర్టుకు ఫిర్యాదు చేసిన రెండో వర్గానికి చెందిన వారసులు భూమి చదును చేయడాన్ని గమనించి రెవిన్యూ, పోలీస్ వర్గాలకు ఫిర్యాదు చేశారు. దీంతో, అధికారులు వచ్చి పనులను నిలిపివేశారు. వివాదాస్పద భూమిని కొనుగోలు చేయడానికి ముఖ్య కారణం కోట్లాది రూపాయలు విలువచేసే ప్రభుత్వ భూమిని చేజిక్కించు కోవచ్చుననే ఆలోచనలో ఉన్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమణదారుల వశం కాకుండా కాపాడాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

యంత్రాలను విడిచిపెట్టిన అధికారులు:

వివాదాస్పద భూమిలో చదును చేసిన యంత్రాలను రెవెన్యూ, పోలీస్ అధికారులు విడిచి పెట్టడం వెనుక అధికార పార్టీకి చెందిన నేతల ఒత్తిడులు ఉన్నాయని పలువురు చర్చించుకుంటున్నారు.ఆర్డిఓ కోర్టులో ఉన్న వివాదస్పద భూమి అని తెలిసి కూడా లెవెలింగ్ చేస్తున్న యంత్రాలను రెవెన్యూ అధికారులు, పోలీసులు విడిచిపెట్టడం విశేషం. దీని వెనుక అధికారి పార్టీ నాయకుల ఒత్తిడేనా లేక మరో కారణం ఏమైనా ఉందా అని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.



పోరంబోకు భూమిలో చదును చేసే పనులు